


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | శుక్రవారం 17-7-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 304 | పేజీలు: 4 | వెల: రూ.1/-

# తూర్పు పోడా కోడె ప్రతిమను ఆవిష్కరించిన తలసాని

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మరో ఏడాది పొడిగింపు

హైదరాబాద్,జూలై 16(ఆర్ఎన్ఎ): బాగా ప్రసిద్ధి చెందిన పశుజాతికి చెందిన తూర్పు పోడా కోడె ప్రతిమను గురువారం పశుసంవర్ధక శాఖ ఆవరణలో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈపశు జాతి, నల్లమల్ల అడవి ప్రాంతంలోనిమన్ననూర్,అమ్రాబాద్ మండలం, నాగర్ కర్నూల్ జిల్లలో ఎక్కవగా ఉంటాయన్నాడు. . దీనిని ఎన్‌బిఎజిఆర్ ఇండియా, తెలంగాణ స్థానిక జాతిగా గుర్తించింది. ఈ పశువులకుప్రధానంగా తెలుపు చర్మంపై గోధుమ, ఎరుపు మచ్చలు లేదా లేత గోధుమ రంగు చర్మంపై తెల్లని మచ్చలు,సూటి ,పదునైన కొమ్ములను కలిగి ఉంటాయి. అన్ని కాలాలలోఈ పశువులు వ్యవసాయ పనులుచాలా సమర్థవంతగా చేస్తాయి. వీటి ఉత్పాదక శక్తి చాలా ఎక్కువ. ఆవులు క్రమం తప్పకుండా దాని జీవిత కాలంలో 10 కంటే ఎక్కువ దూడలను ఇస్తాయి.

ఈ పశువులువేంత తక్కువగా తిని,రోజుకు 20 లీటర్ల కన్నా తక్కువ నీరు తాగుతుంది. ఈ పశువులు సుదూర అటవీ ప్రాంతంలోని నీటిని గుర్తించి తాగి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం పశువైద్య సేవలలో రైతులకు ఇబ్బంది రాకుండా పశువైద్య ,పశుసంవర్ధక శాఖలో 530 వివిధ స్థాయిలలో పనిచేస్తుచున్నఆవుట్ సోర్సింగ్ ఉద్యోగులను మరో ఏడాది 31,మార్చి, 2021 వరకు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లుమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలియజేసినారు. అదేవిధంగాఈ ఆషాడమాస బోనాల సందర్భంగా రాష్ట్రంలో కృతిమ గర్భధారణలో విశేష సేవలు అందిస్తున్న (1300) మందిగో పాలమిత్రులకు ఒక్క నెల వేతనభత్యం విడుదల చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమములోసంచాలకులు డా. వి. లక్ష్మారెడ్డి,అదనపు సంచాలకులు డా. ఎస్. రాంచందర్ ,ఓ.ఎస్.డి. శ్రీ కళ్యాణ్ కుమార్, డైరెక్టరేట్ సిబ్బంది,పాల్గొన్నారు.



. హైదరాబాద్‌లో అరుదైన తూర్పు పోడా కోడె ప్రతిమ ఆవిష్కరించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

# కరోనాపై ఆక్స్‌ఫర్డ్ గుడ్ న్యూస్

## ట్రయల్ రన్స్ సక్సెస్ అవుతున్నాయని వెల్లడి

న్యూఢిల్లీ,జూలై 16(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ ప్రపంచాన్నే వణికిస్తుంది. ఈ వైరస్‌ను వివారించేందుకు ప్రపంచ దేశాల్లోని ఎంతో మంది శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు. ఇటీవల కరోనా వైరస్ కట్టడికి వ్యాక్సిన్‌ను కనిపెట్టిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వాక్సిన్ ట్రైల్స్‌కు సంబంధించి శుభవార్త చెప్పనుంది. ఈ వ్యాక్సిన్‌కు సంబంధించి ఫేస్-3 హ్యూమన్ ట్రైల్స్ పూర్తి చేశామని యూనివర్సిటీ స్పష్టం చేసింది. కరోనా వ్యాక్సిన్ ట్రైల్స్‌లో మంచి ఫలితాలు వచ్చయని యూనివర్సిటీ తెలిపింది. వివిధ దేశాలలో వందల మంది కంనా వ్యాక్సిన్‌కు సంబంధించిన ప్రయోగాలు చేస్తున్నా.. వాటిలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శటీ లైసెన్స్ పొందించిన ప్రముఖ ఇండియన్ ఫార్మా కంపెనీ ఆస్ట్రాజెనెకా వాక్సిన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. దీంతో తర్వలోనే కరోనా వ్యాక్సిన్‌కు సంబం ధించి శుభవార్త వినే అవకాశం ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. అయితే కరోనా వ్యాక్సిన్ ట్రైల్స్‌లో మంచి ఫలితాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇది వాడటం వల్ల ఇతర సమస్యలు వచ్చే అవకాశాలు లేవని, ఇది సురక్షితమైన వ్యాక్సిన్‌గా పరీక్షల్లో తేలింది. దీనిని వాలెంటర్ల మీద ప్రయోగించినప్పుడు చక్కని ఫలితాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు వివిధ దేశాలలో వందల మంది కరోనా వ్యాక్సిన్‌కు సంబంధించిన ప్రయోగాలు చేస్తున్నారు. అయితే వాటిలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శటీ లైసెన్స్ పొందించిన ప్రముఖ ఇండియన్ ఫార్మా కంపెనీ ఆస్ట్రాజెనెకా వాక్సిన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ శాస్త్రవేత్త ఒకరు చెప్పారు. ఈ ట్రైల్స్‌కు సంబంధించిన సమాచారం ప్రముఖ మెడికల్ జర్నల్ లాన్సెంట్‌లో రానుంది. దీనికి సంబంధించి ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ శాస్త్రవేత్త మాట్లాడుతూ కరోనా వ్యాక్సిన్‌కు సంబంధించిన విషయాన్ని ఎప్పుడూ పబ్లిష్ చేస్తారు అన్న విషయాన్ని ఇంకా లాన్సెంట్ సంస్థ కచ్చితంగా చెప్పలేదని తెలిపారు. అయితే ఈ వ్యాక్సిన్ మంచి ఫలితాలను ఇచ్చిందని, ఇది మనుషుల మీద ప్రయోగించినప్పుడు చక్కగా పనిచేసినట్లు తెలుస్తోంది.



2.రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలసి వినతిపత్రం సమర్పించిన టిడిపి ఎంపిలు గల్లా జయదేవ్,కేశినేని నాని, రామ్మోహన్ నాయుడు తదితరులు

# మరో టీఆర్ఎస్ ఎమ్మెల్యేకు కరోనా

## ఇంట్లోనే ఐసోలేషన్‌కు వెళ్లిన భాస్కర్ రావు

హైదరాబాద్,జూలై 16(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ప్రజాప్రతినిధులను కరోనా భయం వెంటాడుతోంది. ముఖ్యంగా అధికార టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కోవిడ్ కంగారు పెడుతోంది. వరుసగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కరోనా వైరస్ సోకుతుంది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలకు కరోనా సోకగా తాజాగా మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు సైతం కరోనా బారినపడ్డారు. జలుబు, దగ్గు లక్షణాలు కనిపించడంతో రెండు రోజుల కింద ఆయన పరీక్షలు చేయించుకున్నారు. బుధవారం రిపోర్టులు వచ్చాయి. అందులో కరోనా పాజిటివ్ రావడంతో మిర్యాలగూడలోని తమ ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉన్నారు. దీంతో కరోనా బారిన పడుతున్న రాజకీయ నేతల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే టీఆర్ఎస్ పార్టీకి చెందిన హోంమంత్రి మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, గణేష్ గుప్తా కరోనా బారినపడ్డారు. ఇక కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావు, గూడూరు నారాయణ రెడ్డి, బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కరోనా సోకిన విషయం తెలిసిందే. ఐతే వీరిలో చాలా మంది ఇప్పటికే కోలుకొని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. ఇక తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కరోనా వైరస్ వేగంగా విస్తరిస్తోంది. రోజు రోజుకీ కరోనా కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 39,342కి చేరింది. ఇందులో 12,958 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటివరకు వైరస్ నుంచి 25,999 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. రాష్ట్రంలో మొత్తం మృతుల సంఖ్య 386కి చేరింది.

# మరింత సులభంగా ఈడీఎస్

## బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ప్రత్యేక ఏర్పాట్లు

న్యూఢిల్లీ,జూలై 16(ఆర్ఎన్ఎ): ఎక్కువ మొత్తంలో నగదు ఉపసంహారణలపై విధించే ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్ (టీడీఎస్) రేటు నిర్ణయం మరింత సులభం కానున్నది. అందుకోసం బ్యాంకులు, పోస్టాఫీస్‌ల కోసం ప్రత్యేక సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు ఆదాయపు పన్ను శాఖ ప్రకటించింది. ప్రస్తుతం ఐటీఆర్ దాఖలు చేయని వ్యక్తి రూ.20 లక్షలకు మించి, ఇతరులు రూ.ఒక కోటికి మించి పైగా నగదు ఉపసంహరిస్తే టీడీఎస్ రేటు వర్తిస్తుంది. ఇక నుంచి నగదు ఉపసంహరించే వ్యక్తి పాన్ వివరాలు నమోదు చేస్తే, వెంటనే టీడీఎస్ రేటు సందేశం కనిపిస్తుందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) తెలిపింది. ఐటీఆర్ దాఖలు చేసే వ్యక్తి రూ.కోటికి మించి నగదును ఉపసంహరిస్తే 2 శాతం టీడీఎస్ ఉంటుంది. ఐటీఆర్ దాఖలు చేయని వారు రూ.20 లక్షలు మించి ఉపసంహరిస్తే 2 శాతం, రూ.కోటికి మించి ఉపసంహరిస్తే రూ.5 శాతం మేర పన్ను విధిస్తారు. బ్యాంకులు, పోస్టాఫీస్‌లు సంబంధిత ఖాతాదారు పాన్ నెంబర్ ఎంటర్ చేస్తే వారి వెబ్ సైట్ పైన ఒక మెసేజ్ కనిపిస్తుంది. దాని ప్రకారం టీడీఎస్ మినహాయిస్తే చాలు. ఐటీ ఐటీ రిటర్న్ దాఖలు చేయని వారి పేర్ల మీద భారీగా నగదు ఉపసంహరణలు జరుగుతున్నట్లు వెల్లడైన నేపథ్యంలో జూలై 1వ తేదీ నుంచి ఇది అమల్లోకి వచ్చేలా సీబీడీటీ సదుపాయం కల్పించింది. అంటే ఐటీ రిటర్న్ దాఖలు చేస్తే రూ.కోటికి మించి ఉపసంహరిస్తే, రిటర్న్ దాఖలు చేయకుంటే రూ.20 లక్షలకు మించి ఉపసంహరిస్తే టీడీఎస్ రేటు వర్తిస్తుంది. ఐటీ శాఖ వెబ్ సైట్ లో వెరిఫికేషన్ ఆఫ్ ద్వారా ఇది అందుబాటులో ఉందని సీబీడీటీ తెలిపింది. ఆదాయపు పన్ను శాఖ సవరణ ప్రకారం జూలై 1, 2020నుండి నాన్-÷లైర్స్‌కు టీడీఎస్ వర్తించే నగదు ఉపసంహరణ పరిమితిని రూ.20 లక్షలకు తగ్గించారు. సీబీడీటీ... బ్యాంకులు, పోస్టాఫీస్‌లకు అందించిన ఈ కొత్త సదుపాయంపై 53,000కు పైగా వెరిఫై చేయగా సక్సెస్ అయ్యాయని తెలిపింది.

# ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

యాదాద్రి భువనగిరి, జూలై16(ఆంఎన్ఎ): కూతురు ప్రేమ వివాహం చేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోబోగా పోలీసులు కాపాడారు. ఈ ఘటన బీబీనగర్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోచంపల్లి మండలానికి చెందిన కే రమేశ్(50) ఓ ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే రమేశ్ కూతురు ఇటీవలే ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపైకి ఉదయం చేరుకున్నాడు. ఆ వ్యక్తిని గుర్తించిన మరొకరు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన కానిస్టేబుల్స్ డీ మురళి, మల్లేష్ అక్కడికి చేరుకుని రమేశ్‌ను ప్రాణాలతో కాపాడారు. రమేశ్ ను బీబీనగర్ పోలీసు స్టేషన్ కు తరలించి.. కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

# ముంబైని ముంచెత్తిన భారీ వర్షం

ముంబై,జూలై16(ఆర్ఎన్ఎ): దేశ ఆర్థిక రాజధాని ముంబైని వాన ముంచెత్తింది. బుధవారం రాత్రి 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 8.30 వరకు భారీగా వాన కురిసింది. దీంతో మహానగరంలో రోడ్లన్ని జలమయమయ్యాయి. పన్నెండు గంటలపాటు వాన కురియడంతో 191.2 మి.మీ. నమోదయ్యిందని శాంతాక్రజ్ వెదర్ అబ్జర్వేటరీ ప్రకటించింది. దీంతో జూలై నెలలో 2015 తర్వాత అత్యంత భారీ వాన కురియడం ఇది రెండోసారని తెలిపింది. 2019, జూలై 3న అత్యధికంగా 215.6 మి.మీ.వాన కురిసిందని వెల్లడంచింది. 2014, జూలై 3న 207.2 మి.మీ. వర్షం కురిసిందని, 2013లో కురిన 215.6 మి.మీ. వాన ఇప్పటి వరకు అత్యధికమని పేర్కొంది. మొత్తంగా ఈ ఏడాది జూన్ 1 నుంచి జూలై 16 వరకు 1,418 మి.మీ. వాన కురిసిందని, సాధారణంగా 2260.4 మి.మీ .వాన నమోదవ్వాల్సి ఉందని తెలిపింది. ఈ సీజన్‌లో 63 శాతం మాత్రమే వాన కురిసిందని వెల్లడించింది.ం

# బక్రీద్ రోజు ఆవులను బలివ్వద్దన్న ఎంఐఎం నేత

## స్వాగతించిన చిలుకూరు ఆలయ పూజారి రంగరాజన్

హైదరాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఆవులను బలి ఇవ్వొద్దని కరీంనగర్ ఎంఐఎం నాయకుడు గులాం అహ్మద్ హుస్సేన్ చేసిన ప్రకటనను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు సి.ఎస్. రంగరాజన్ తెలిపారు. అదేవిధంగా ఇతర ముస్లిం మత పెద్దలు కూడా ఇదే విధంగా ప్రకటనలు చేయాలని అభ్యర్థిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి ప్రకటనలే ప్రతీ ఏడాది బక్రీద్ కంటే ముందే చేయవలసి ఉందన్నారు. ఎందుకంటే ఒక్క రోజే లక్షలాది ఆవులు, దూడలు బలి ఇవ్వడం హిందువుల్లో గొప్ప వేదనకు దారితీస్తుందన్నారు. సమాజాల మధ్య ఘర్షణలు పెరుగుతాయన్నారు. కాగా ఇటువంటి ప్రకటనలు మతాల మధ్య సామరస్యాన్ని బలంగా ఏర్పరు స్తాయన్నారు. బక్రీద్ పర్వదినం నాడు ఆవులను బలి ఇవ్వవద్దని ఎఐఎంఐఎం నాయకుడు, కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ ముస్లి సమాజాన్ని కోరారు. జాతీయ సమగ్రత కోసం ప్రభుత్వం ఆవు బలిని నిషేధించిందన్నారు. మనమంతా ప్రభుత్వ చర్యలు, నియమాలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఇస్లాం ప్రకారం ఏ కార్యక్రమం సమాజం లోని ఇతర వ్యక్తులను బాధించకూడదని ఆయన అన్నారు. మహ్మద్ ప్రవక్త కూడా ఇదే చెప్పారన్నారు. మత సంప్రదాయాలు, సంస్కృతిని పాటించే ప్రతీ ముస్లిం ఇస్లాంకు వ్యతిరేకంగా వెళ్లవద్దన్నారు. కోవిడ్ -19 వ్యాప్తి దృష్ట్యా ముస్లింలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ నియమాలను ఉల్లంఘిస్తే విపత్తు నిర్వహణ చట్టం, 1897 ప్రకారం చర్యలను ఎదురొక్కవాల్సి వస్తుందన్నారు. పశువుల మార్కెట్లలో ఆవుల అమ్మకాలను ఆపడానికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్‌ను కోరారు. భౌతిక దూరం పాటిస్తూ బక్రీద్ జరుపుకోవాలని ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. గులాం అహ్మద్ హుస్సేన్ ప్రకటనను చిలుకూరు బాలాజీ ఆలయంతో పాటు పలు హిందూ మత సంఘాలు స్వాగతించాయి.

# దుబాయ్ ఆసుపత్రి ఔదార్యం

## -హైదరాబాద్ చేరుకున్న జగిత్యాల వాసి

హైదరాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన దుబాయ్ హాస్పిటల్ ఔదార్యాన్ని ప్రదర్శించింది. తెలంగాణకు చెందిన కోవిడ్ రోగి బిల్లును మాఫీ చేసింది. 42 ఏళ్ల ఓడ్నాలా రాజేశ్ అనే వ్యక్తి దుబాయ్ హాస్పిటల్‌లో 80 రోజులు కోవిడ్ చికిత్స తీసుకున్నాడు. తెలంగాణలోని జగిత్యాల జిల్లాకు చెందిన అతని చికిత్స కోసం 1.52 కోట్లు ఖర్చు అయ్యింది. కోవిడ్19 చికిత్స పొందిన రాజేశ్‌ది ఆ బిల్లు కట్టలేని పరిస్థితి. దుబాయ్‌లోని గల్ఫ్ వర్కర్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు గుండెల్లి నర్సింహా.. రాజేశ్‌ను హాస్పిటల్‌లో చేర్పించాడు. అయితే బిల్లు విషయాన్ని నర్సింహా.. దుబాయ్ కాన్సులేట్‌లో ఉన్న సుమంత్ రెడ్డికి చేరవేశాడు. స్వామినారాయణ్ ట్రస్ట్‌కు చెందిన హర్జిత్ సింగ్.. దుబాయ్ కాన్సులేట్‌కు లేఖ రాశారు.

మానవతా కోణంలో బిల్లును మాఫీ చేయాలని ఆయన దుబాయ్ హాస్పిటల్ యాజమాన్యాన్ని కూడా కోరారు. అయితే ఆ లేఖ పట్ల దుబాయ్ హాస్పిటల్ పాజిటివ్‌గా స్పందించింది.. బిల్లును మాఫీ చేసింది. మరో కార్మిక నేత అశోక్.. రాజేశ్‌కు విమాన టికెట్ ఇప్పించాడు. ఎయిర్ ఇండియా విమానంలో బుధవారం హైదరాబాద్ చేరుకున్న రాజేశ్.. 14 రోజుల హోమ్ క్వారెంటైన్‌కు వెళ్లారు.

## ఆచార్య స్వామిశ్రీ మహారాజ్ మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

ఢిల్లీ,జులై 16: ఆచార్య శ్రీ పురుషోత్తంప్రియదాస్ జీ స్వామిశ్రీ మహారాజ్ మరణం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంతాపాన్నివ్యక్తం చేశారు. "సమాజాని కి ఆచార్య శ్రీ పురుషోత్తంప్రియదాస్ జీ స్వామిశ్రీ మహారాజ్ చేసిన పవిత్ర సేవ కు గాను మనం ఆయన ను ఎప్పటికీ స్మరించుకోవాలి. ఆయన మనుషుల బాధల ను తగ్గించడం కోసం కఠోరం గా శ్రమించారు. ఒక్క భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తం గా కూడా ఆయనున్నుస్మరించుకొంటున్నారు." అని మోదీ ట్వీట్ చేశారు. "ఆచార్య శ్రీ పురుషోత్తంప్రియదాస్ జీ స్వామిశ్రీ మహారాజ్ కు అపారమైన జ్ఞానం ఉన్నది. సామాజిక సేవ, విద్య పట్ల ఆయన తనవంతుగా సాయం చేశారు.

# స్పీడుగా నిమ్స్‌లో కరోనా క్లినికల్ ట్రయల్స్

హైదరాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): నిమ్స్ దవాఖానలో కరోనా వాక్సిన్ క్లినికల్ పరీక్షలు స్పీడ్ అందుకున్నాయి. ఫస్ట్ ఫేజ్‌కు ఏర్పట్లు సిద్ధం చేశారు. ఇద్దరికి వ్యాక్సిన్ ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఆరుగురు వాలంటీర్ల రక్త నమూనాలు సేకరించిన నిమ్స్ వైద్యులు ఐసీఎంఆర్‌కు పంపించారు. వారిపై వ్యాక్సిన్ పరీక్షలకు ఐసీఎంఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. వాక్సిన్ ఇచ్చాక 2 రోజుల పాటు ప్రత్యేక వార్డుల్లో వైద్యుల అబ్జర్వేషన్‌లో ఉంచనున్నారు. యాంటీ బాడీస్ డెవలప్‌మెంట్ అయ్యే తీరును వైద్యులు పరిశీలించనున్నారు. ఇబ్బందులు లేకపోతే 2 రోజుల తర్వాత డిశ్చార్జ్ చేయనున్నారు. అన్నీ బాగుంటే కోవాగ్జిన్ రెండో డోస్‌ను 14 రోజుల తర్వాత మళ్లీ వలంటీర్లకు నిమ్స్ దవాఖానలో వైద్యులు ఇవ్వనున్నారు.

# వ్యవసాయరంగానికి కేసీఆర్ పెద్దపీట

## -మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్,జూలై16(ఆర్ఎన్ఎ): సమైక్య రాష్ట్రంలో వెనుకబడిన వ్యవసాయరంగం స్వరాష్ట్రంలో పునరుత్తేజం పొందిందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. రైతు సంక్షేమం లక్ష్యంగా రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. గురువారం సోన్ మండల కేంద్రంలో రూ.22లక్షలతో నిర్మించనున్న రైతుబంధు వేదిక నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తక్కువ కాలంలోనే వ్యవసాయరంగం అనూహ్యంగా అభివృద్ధి సాధించిందన్నారు. సీఎం కేసీఆర్ దార్శనికత, ముందు చూపుతోనే సాధ్యపడిందని చెప్పారు. అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రైతులందరికీ రైతుబంధు ద్వారా ఎకరానికి రూ.5వేలు ఇస్తున్న ఘనత టీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే రైతుల కోసం బీమా పథకం అమలు చేస్తుందన్నారు. రైతుల వ్యవసాయానికి 24గంటల కరెంటు ఇస్తుందని, దీంతో రూ.7వేల కోట్లు సబ్సిడీ భారం పడుతున్న రైతుల మేలు కోసం ఈ భారం భరిస్తుందన్నారు. రైతుబంధుతో రైతన్న ఇవాళ ధైర్యంగా ఉన్నాడని, పండించిన ఆఖరి గింజ వరకు ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. రైతుల కోసం వేదికలు నిర్మిస్తున్నామని, అందరు చర్చించుకునేందుకు, వ్యవసాయాధికారులతో సమావేశమయ్యేందుకు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. అనంతరం లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామంలో రైతు వేదిక భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు.



నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలో మొక్కలు నాటిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

## చరిత్రలో నేటినిజం



కం॥ ఘనతరముగ నటియించెడి
వనిత "జరీనా వహాబు" వైదుష్యము తోన్
సినిమాలా నాయికగా
జనుల మనంబులను దోచె చతురత ధీశాలిగాన్!!

( జూలై 17 నటి జరీనా వహాబ్ జన్మదినం..)

-రాధశ్రీ
సెల్: 9494481210



# సుశాంత్ మృతిపై సీబీఐ విచారణ

## -కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు నటి రియా చక్రవర్తి లేఖ

ముంబై,జూలై16(ఆర్ఎన్ఎ): నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణంపై నటి రియా చక్రవర్తి ఎట్టకేలకు నోరు విప్పారు. సుశాంత్ మృతిపై సీబీఐ విచారణ కోరుతూ ఆమె కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. జూన్ 14వ తేదీన ముంబై నివాసంలో సుశాంత్ విగత జీవిగా కనిపించారు. కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న ఒత్తిడి, నిరాశలో అతడు ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పేర్కొన్నారు. కేసు విచారణను ముంబై పోలీసులు చేపట్టారు. ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన తన పోస్ట్‌లో రియా తననుతానుసుశాంత్ గర్ల్‌ఫ్రెండ్‌గా పేర్కొంది. లేఖలో ఆమె ఈ విధంగా పేర్కొన్నారు. గౌరవనీయమైన అమిత్ షా సార్, నేను సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ గర్ల్‌ఫ్రెండ్ రియా చక్రవర్తి. సుశాంత్ ఆకస్మిక మరణం చెంది నెల రోజులు దాటింది. కేసు దర్యాప్తులో ప్రభుత్వ విచారణపై పూర్తి నమ్మకం ఉంది. కాగా న్యాయం కోసం ఈ విషయంలో సీబీఐ విచారణ చేయాల్సిందిగా మిమ్మల్ని చేతులెత్తి అభ్యర్థిస్తున్నాను. సుశాంత్ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రేరేపించిన ఒత్తిళ్లు ఏమిటో తాను తెలుసుకోవాలనుకుంటున్నాను. సత్యమేవ జయతే అంటు రియా లేఖను ముగించారు.

# గల్ఫ్ కార్మికుతల రాకతో ఉపాధి సమస్యలు

నేటినిజం
శుక్రవారం 17-7-2020

కరోనాదెబ్బకు ఎడారి దేశాల్లో ఉపాధి కోసం వెళ్లిన వారి ఆశలు ఆవిరయ్యాయి. సౌదీఅరేబియా, మస్కట్, దుబాయ్, ఓమన్, షార్జా, ఖతర్, ఇరాన్, ఇరాక్, మలేషియా, సింగపూర్ లాంటి గల్ఫ్ దేశాల్లో వీరంతా వలస కూలీలుగా ఉపాధి పొందుతున్నారు. గల్ఫ్‌మోజులో పడ్డ వేలాదిమంది లక్షల రూపాయలు అప్పులు చేసి అక్కడికి వెళ్లి జీవిస్తున్నారు. అన్ని దేశాల్లో చమురు ధరలు తగ్గడంతో పాటు,కరోనా ప్రభావంతో అక్కడ ఉన్నవారు పనులు దొరక్క సొంత దేశాలకు తిరిగి రావాల్సిన ఆగత్యం ఏర్పడింది. ఇలా మనదేశానికి చెందిన లక్షలాది మంది పొట్ట చేతబట్టుకుని దేశానికి తరలి వస్తున్నారు. ఈ దశలో దేశంలో ఉన్న వారికే ఉపాధి దక్కన పరిస్థితుల్లో ..గల్ఫ్ దేశాల నుంచి వస్తున్న కార్మికులకు ఉపాధి కల్పించడం ప్రభుత్వాలకు పెద్ద సవాల్‌గా మారనుంది. ఈ దశలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఈ సమస్యపై చర్చించాల్సిన అవసరం ఉంది. ఇది సామాజిక సమస్యగా ఉత్పన్నం కాకముందే రాష్ట్రాలను విశ్వాసం లోకి తీసుకుని ఉపాధికి సంబంధించి పెద్ద ఎత్తున కార్యాచారణ పెట్టడంపై కేంద్రం దృష్టి సారించారు. ప్రధానంగా ఇప్పుడు దీనిపైనే దృష్టి పెట్టి, దేశీయంగా ఏయే రంగాల్లో ఉపాధి కల్పించవచ్చో ఆలోచన చేయాలి. అలాగే అవసర మైతే కొత్త ప్రాజెక్టులు చేపట్టి ఉపాధికి శ్రీకారం చుట్టాలి. ఇదే అదనుగా వ్యవసాం, అనుబంధ పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించాలి. రోడ్ల నిర్మాణం, వంతెనల నిర్మానాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలి. కూరగాయల సాగును ప్రోత్సహించాలి. స్వదేశీ నినాదం ఇచ్చిన ప్రధాని అందుకు అనుగుణంగా మాస్కుల నుంచి టెస్టింగ్ కిట్ల తయారీకి పెద్ద ఎత్తున పూనుకోవాలి.

గల్ఫ్‌దేశాల్లో కరోనా ప్రభావం కారణంగా మూతపడిపోయిన వందలాది పరిశ్రమలు తమ వద్ద పని చేసే కార్మికులను తొలగిం చేశాయి. అలాగే మరికొన్ని కంపెనీలు అన్‌పేడ్ లీవ్ పేరిట వెనక్కి పంపించేశాయి. పరిస్థితులన్నీ చక్క బడిన తరువాత తిరిగి ఉపాధి కల్పిస్తామంటూ చెప్పి వారిని కొలువుల్లో నుంచి తొలగించేశాయి. కువైట్ లాంటి దేశంలో చట్టం ద్వారా తమ వద్ద ఉన్న విదేశీయులను వెనక్కి పంపించే పనిలో పడ్డాయి. ఇలా వెళ్లిన వారు వేలల్లో అప్పులు చేసి ఆయా దేశాలకు వెళ్లారు. ఆ అప్పులే ఇంకా వేధిస్తున్నాయి. ఇప్పుడు తిరిగి స్వదేశానికి రావడంతో అప్పులకు తోడు నిత్యం బతకడం కూడా వీరికి సమస్యగా మారింది. గల్ఫ్ దేశాలకు వెళ్ళేందు కోసం చేసిన అప్పులే ఇప్పటి వరకు తీరలేదని, మళ్లీ కొత్త వ్యాపారాలకు పెట్టుబడుల కోసం డబ్బులు ఎలా సమకూర్చుకోవాలతన్న ఆందోళనకు గురవుతున్నారు. గల్ఫ్ దేశాల నుంచి తిరిగి వచ్చిన వారందరికీ ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలంటే సాధ్యమయ్యే పనేనా అన్నది కూడా ఆలోచించాలి. కరోనా ప్రభావంతో వేలాదిమంది ఇప్పటికే తమ స్వస్థలాలకు చేరుకుంటున్నారు. మరికొంత మంది కూడా వెనక్కివచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్థిక పరమైన, సాంకేతిక పరిమైన కారణాలతో వీరు తాత్కా లికంగా గల్ఫ్ దేశాల్లోనే హోం క్వారంటైన్ పేరిట ఇండ్లకే పరిమిత మైపోయారు. కొద్దిరోజుల్లో వీరు కూడా తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రపంచ దేశాలను పాతాళానికి తొక్కేసిన కరోనా వైరస్ గల్ఫ్ దేశాలను సైతం కబలించేసింది. ఈ వైరస్ వ్యాప్తి కారణంగా గల్ఫ్ దేశాన్ని సంక్షోభంలోకి కూరుకు పోయాయి. ఈ దేశంలోని పరిశ్రమ లన్నీ మూత పడిపోయాయి. ఇక్కడి అనేక పరిశ్రమలు, కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో లక్షలాది మంది భారతీయులు కూలీలగా పనిచేస్తున్నారు. అయితే లాక్‌డౌన్‌తో ఇవన్నీ మూతపడిన క్రమంలో ఇందు టలో పనిచేసే కూలీలకు యాజమాన్యాలు వేతనాలు చెల్లించలేక చేతులె త్తేశాయి. గల్ఫ్‌దేశాల్లోని భారత ఎంబసీ అధికారులు వీరిని తాత్కాలికంగా ఆదుకున్నారు. కొన్ని కంపెనీలు రెండు, మూడు నెలల వేతనాలు చెల్లించకుండానే తమ ఉద్యోగులను తొలగించుకోగా మరికొన్ని కంపెనీలు అన్‌పెయిడ్ లీవ్ పేరిట సెలవులు ప్రకటించి ఉద్యోగాల నుంచి పరోక్షపద్ధతిలో పక్కకు నెట్టేశాయి. ఈ పరిణామాలతో అక్కడ బతుకీడుస్తున్న వలసకూలీలు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారు. ఇక్కడి పరిస్థితులు రోజురోజుకు కఠినంగా మారడం, కరోనా తీవ్ర త తగ్గకపోవడంతో చాలా మంది తమ సొంత డబ్బులు వెచ్చించి స్వగ్రామాలకు తిరిగి వచ్చారు. అలాగే మరికొంతమంది ఆర్థిక పరిస్థితుల కారణంగా అక్కడే ఉండిపోయి తమను ఎవరైనా స్వస్థలాలు పంపేందుకు సహకరించాలని కోరుతున్నారు. ఇలాంటి వారిలో నుంచి చాలా మంది స్వచ్ఛందసంస్థలు, తెలంగాణ జాగృతి లాంటి చాలా సంస్థలు విమాన టికెట్‌లు భరించి స్వస్థలాలకు పంపాయి. ఇలా స్వగ్రామాలకు చేరుకున్న వారంతా ఉపాధి కరువై ప్రత్యామ్నాయ ఉపాధికోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న వారు ఇప్పటివరకు తాము సంపాదించే కొంతమొత్తం నుంచి తమ కుటుంబ సభ్యులకు పంపేవారు. దీంతో మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెన్సీలు జిల్లాలో ఎక్కువగా వెలిశాయి. ఈ కరోనా సంక్షోభం కారణంగా వలస కార్మికులంతా స్వస్థలాలకు తిరిగి వస్తున్నం దున మనీ ట్రాన్స్‌ఫర్ దందా కూడా కుదేలయ్యింది. ఈ దందా పై ఆధారపడి జీవనం పొందుతున్న చాలా మంది ఉపాధి కోల్పోతున్నారు. ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్ని వర్గాలపై గల్ఫ్ కార్మికుల సమస్య ప్రభావం చూపడంతో ఉపాధి కల్పన వ్యవహారం జిల్లా యంత్రాంగానికి ఓ సమస్యగా మారబోనుందని అంటున్నారు. దీనికితోడు దేశంలోనూ లాక్‌డౌన్‌తో పరిశ్రమలు, దుకాణాలు మూతపడ్డ కారణంగా దీనిని అదునుగా చేసుకున్న యాజమాన్యాలు తిరిగి తమ వద్దకు రావద్దంటూ సిబ్బందిని హెచ్చరించాయి. అలాగే ఇదే అదునుగా భావించి మూడు, నాలుగు నెలలకు సంబంధించిన వేతనాలు చెల్లించకుండా చేతులేత్తేశాయి. లాక్‌డౌన్ తీవ్రత ఓవైపు, కరోనాతీవ్రత మరోవైపు తీవ్ర ప్రభావం చూపడంతో కూలీలంతా బయటకు వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. సందట్లో సడేమియా లాగా చాలా మంది పరిశ్రమలు, దుకాణాల యజమానులు అజ్ఞాతం లోకి వెళ్లిపోయి కూలీలకు అందుబాటులో లేకుండాపోయారు. దీంతో కూలీలంతా గల్ఫ్ దేశాల్లోని తమకు తెలిసిన వారి నుంచి అప్పో సప్పో చేసుకొని ఇప్పటి వరకు నెట్టుకొచ్చారు. దీంతో తమను తమ స్వస్థలా లకు పంపాలంటూ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తూ వీరిలో నుంచి చాలా మందిని స్వదేశానికి తీసుకువచ్చింది. గల్ఫ్‌దేశాల నుంచి తిరిగి వస్తున్న వారంతా తమ స్వస్థలాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకేసారి గల్ఫ్ దేశాల నుంచి వలస కూలీలు వేలల్లో తిరిగి వస్తుండడంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా కనిపించడం లేదంటు న్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం కొంత మేరకు ఆదుకుంటున్నప్పటికీ ఇది పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించ లేదని వారు అభిప్రా యపడుతున్నారు. స్థానికంగా వ్యవసాయ పనులు, వ్యాపారాలు చేసుకునే దిశగా కొంతమంది ప్రయత్నిస్తున్నారు. ఇలా వచ్చిన వారు దాదాపుగా అన్ని రాష్ట్రాల్లోనూ ఉన్నారు. వారిని ఆదుకోవడానికి ప్రత్యామ్నాయా ఉపాధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలి. ఆయా రాష్ట్రాల్లో ఉన్న వనరులను తెలుసుకుని ముందుకు వెళ్లాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది.

## కరోనా టెస్టులు పెంచి ఆరోగ్యశ్రీలో చేర్చాలి: సిపిఐ

ఆదిలాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా టెస్టులు పెంచి చికిత్సలను ఆరోగ్యశ్రీలో చేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కలవేన శంకర్ కోరారు. రాష్ట్రంలో కరోనా విజృంభిస్తున్న తరుణంలో ప్రభుత్వం చేతులు ఎత్తివేసిందని, కార్పొరేట్ ఆసుపత్రులకు పర్మిషన్ ఇవ్వడంతో లక్షల రూపాయలు దండుకుంటు న్నాయని మండిపడ్డారు. పేదలకు కరోనా వస్తే అంత డబ్బు ఎక్కడ నుంచి తేవాలని, అందుకే కరోనా వైద్యం కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో ఫ్రీగా చేయాలని, ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పేదలకు వైద్యం అందాలంటే కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలని అన్నారు. ఇదిలావుంటే వేలాది మందికి ఉపాధి కల్పించిన సీసీఐ మూతబడి ఏళ్లు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీసీఐ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ఆ రోపించారు. పరిశ్రమను, కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించు కోవాలని అనేకమార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. యూనియన్ ఇంత వరకు ఫ్యాక్టరీని నడిపించడానికి ప్రయత్నం చేసిందని, దీనికి హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం సహకరించిందని అన్నారు. కేంద్రంతో మాట్లాడి సీసీఐని తెరిపిస్తామని భరోసా కల్పించారని, కేంద్ర ప్రభుత్వమే సహకరించడం లేదని ఆరోపించారు.

## రైతులకు అండగా వేదికల నిర్మాణం: రేఖానాయక్

ఆదిలాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. రైతుల ఐక్య వేదిక భవన నిర్మాణాలతో వారిని సంఘటితం చేస్తామని అన్నారు. ఐక్య వేదిక వల్ల రైతాంగానికి న్యాయం జరుగుతుందని, రైతులు అన్ని విధాలుగా అభివద్ధి చెందే విధంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందిస్తుందన్నారు. రైతు ఐక్య వేదికల వల్ల పండించిన పంటను విక్రయించు కోవచ్చని అన్నారు. ఇదిలావుంటే హరితహారం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఓ యజ్ఞంలా చేపడుతు అన్నారు. గతంలో జిల్లాలో అడవుల విస్తీర్ణం ఎక్కువగా ఉండేదన్నారు. కానీ పట్టణీకరణ పెరిగినందున అడవుల శాతం తగ్గిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో మొక్కలు నాటి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. 90శాతం మొక్కలను బతికించడమే లక్ష్యంగా పంచాయితీలు చర్యలు చేపడుతుందన్నారు.

గత పాలకులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని మొక్కుబడిగా చేపట్టారని విమర్శించారు. కేసీఆర్ సర్కారు మొక్కవోని దీక్షతో ఈ కార్యక్రమం చేపడుతుందని పేర్కొన్నారు. నాటిన మొక్కల్లో 85 శాతం బతుకకుంటే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకునేలా చట్టం చేసి చిత్తశుద్ధిని ప్రదర్శించామన్నారు. సీఎం కేసీఆర్‌కు నీరు, చెట్లు అంటే ప్రాణమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి ఆయన చూపి న బాటలో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.

## రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం

జగిత్యాల,జూలై16(ఆర్ఎన్ఎ): రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, రైతులను సంఘటితం చేయడానికే సీఎం కేసీఆర్ రైతు వేదికలను ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న రైతు వేదికల భవన నిర్మాణాలతో రైతులకు మేలు

జరుగనుందని అన్నారు. రైతులంతా ఒక్క చోట చేరి పంటల సాగు, మార్కెటింగ్, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై చర్చించు కోవడంతో పాటు అత్యాధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకునేందుకు రైతు వేదికలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. జిల్లాలో 48వేల మంది రైతులు రైతుబంధు కింద పెట్టుబడి సాయం పొందుతున్నారని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో ఇప్పటివరకు వెయ్యికి పైగా రైతు కుటుంబాలకు రైతు బీమా అందిందన్నారు. రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలుస్తుందన్నారు. పొలాస వ్యవసాయ కళాశాలలో రూ.45 లక్షలతో భూసార పరీక్షలను నిరంతరంగా చేస్తున్నట్లు చెప్పారు. భూసార పరీక్షలు చేయించుకొని అవసరమైన రసాయనాలను మాత్రమే వాడాలని సూచించారు. కరోనా వైరస్ విస్తరించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కరోనా వైరస్ విస్తరించకుండాప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ఉండి సామాజిక బాధ్యతగా మాస్కులు ధరించాలని ఆయన కోరారు.

## పోడు రైతులను ఆదుకోవాలి

ఖమ్మం,జూలై16(ఆర్ఎన్ఎ): ఫారెస్ట్, పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సింగరేణి, ఏన్కూరు మండలాలకు చెందిన పోడు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తమకు హక్కుపత్రాలు ఉన్నాయని అయినప్పటికీ ఫారెస్ట్, పోలీస్ అధికారులు తప్పుడు కేసులు నమోదుచేసి సాగుచేయకుండా నిర్బంధం చేస్తున్నారని తమ గోడు విన్పించారు. పోడు రైతుల సమస్యలపై హామీ ఇచ్చిన సిఎం కెసిఆర్ తక్షణం స్పందించాలన్నారు.

## గాంధీలో మరో దారుణం

### ఆక్సిజన్ కొరతతో మరొకరు మృత్యువాత

హైదరాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): గాంధీ ఆస్పత్రిలో రోజుకో దారుణం వెలుగు చూస్తోంది. తాజాగా ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరతతో మరో కరోనా రోగి మృత్యువాత పడ్డాడు. శ్రీధర్ అనే వ్యక్తి నాలుగు రోజులగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్నాడు. అయితే అతను చికిత్స కోసం రెండు రోజుల క్రితం ఉస్మానియా ఆస్పత్రిలో చేరాడు. కరోనా టెస్టులు చేయగా పాజిటీవ్ అని తేలింది. దీంతో అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే గాంధీలో ఆక్సీజన్ కొరత వల్ల అతనికి ఆక్సీజన్ పెట్టలేదు. దీంతో బాధిత వ్యక్తి శ్రీధర్ ఇవాళ మృతి చెందాడు. ఉస్మానియాలో ఉన్నన్ని రోజులు ఆక్సీజన్ పెట్టి చికిత్స అందించారని, గాంధీలో మాత్రం ఆక్సిజన్ పెట్టకుండా నిర్లక్ష్యం చేయడంతో మృతి చెందాడని బాధితుడి

బంధువులు ఆరోపిస్తున్నారు. ఇదిలావుంటే కరోనా సమయంలో శ్మశాన వాటికల్లో దహన సంస్కారాలకు మృతదేహాలు ఎదురుచూస్తున్నాయి. హైదరాబాద్‌లో ఎలక్ట్రికల్ శ్మశాన వాటికలు పనిచేయలేదు. రెండు రోజులుగా వర్షం పడటంతో దహనసంస్కారాలకు ఆటంకం ఏర్పడింది. పనిచేస్తున్న ఒకటి రెండు శ్మశాన వాటికలపై వత్తిడి పెరుగుతోంది. ఒకవైపు కరోనా మృతదేహాలు.. మరోవైపు సాధారణ భౌతిక కాయాలు అంతిమ సంస్కారాల కోసం ఎదురుచూస్తున్నాయి.

# గల్ఫ్ సంక్షోభంతో ఆర్థికంగానూ దెబ్బ

### మనదేశానికి వచ్చే ఆదాయంలో 23శాతం కోత
### దాదాపు 19వంద కోట్ల డాలర్లకు గండి

న్యూఢిల్లీ,జూలై16(ఆర్ఎన్ఎ): గల్ఫ్ దేశాల్లో భారతీయులు 90 లక్షలమంది ఉండొచ్చని ఒక అంచనా. ఇందులో పది శాతంమంది మాత్రమే నైపుణ్యం వున్న శ్రామికులు. మిగిలినవారంతా ఏదో ఒక పని చేసి పొట్టపోసుకుంటున్న వాళ్లే. వీరిలో అత్యధికం నిర్మాణ రంగం, పారిశుద్ధ్యం, రవాణా, ఆతిథ్యరంగాల్లో కార్మికులుగా పని చేస్తున్నారు. పెయిడ్ లీవ్ పేరిట యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించింది. దీంతో వీరు తంటాలుపడి స్వగ్రామాలకు చేరుకున్నారు. 14 రోజుల క్వారంటైన్‌ను కూడా పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం ఉపాధి అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి ఆదుకోవాలని వచ్చిన వారు కోరుతున్నారు. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నవారు ఇక్కడ తమ కుటుంబాలకు పంపే మొత్తాలు చాలా ఎక్కువ. నిరుడు విదేశాల్లో స్థిరపడినవారు ఇక్కడికి పంపిన సొమ్ము 8,300 కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇందులో అత్యధిక భాగం గల్ఫ్ దేశాల్లో వలస కార్మికులుగా వుంటున్నవారినుంచి వచ్చిందే. ఈ సొమ్మంతా ఇక్కడున్న మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు ఆధారమవుతోంది. ఇప్పుడు తలెత్తిన కరోనా సంక్షోభం కారణంగా భారత్‌కు వలస కార్మికుల నుంచి వచ్చే మొత్తంలో 23 శాతం...అంటే 1,900 కోట్ల డాలర్లమేర కోత వడొచ్చని ప్రపంచబ్యాంకు అంచనా వేసింది. ఇలా ఆదాయం తగ్గడంతోపాటు లక్షల్లో వెనక్కివస్తున్న వలస కార్మికులకు ఉపాధి చూపించడం కూడా సమస్యే. నెలల తరబడి అన్ని కార్యకలా పాలూ స్తంభించిపోవడం వల్ల ప్రతి దేశమూ ఒడిదుడుకుల్లో పడింది. ఒకప్పుడు బతుకు తెరువు కోసం తలుపు తట్టినవారిని అక్కున చేర్చుకున్న దేశాలే... వారి స్వేదంతో ఆకాశ హర్మ్యాలు నిర్మించుకున్న దేశాలే ఇప్పుడు వెనక్కిపొమ్మని హుకుం జారీ చేస్తున్నాయి. అందుకోసం రకరకాల నిబంధనలు అమల్లోకి తెస్తున్నాయి. గత కొన్ని నెలలుగా అందరూ భయపడుతున్నట్టే కువైట్ కూడా విదేశీయుల సంఖ్యను నియంత్రించే ముసాయిదా బిల్లును సిద్ధం చేసింది. దాని ప్రకారం కువైట్ దేశ జనాభాలో భారతీయులు 15 శాతం మించకూడదు. ఆ దేశ జనాభా 43 లక్షలు. అందులో భారతీయులు14.5 లక్షలు. ఇది చట్టమైతే వారిలో దాదాపు 8 లక్షలమంది నిష్క్రమించక తప్పదు. ఇతర గల్ఫ్ దేశాలు కూడా ఇలాంటి ఆలోచనే చేస్తున్నట్టు చెబుతున్నారు. అదే నిజమైతే ఈ సంఖ్య ఇంకా పెరగొచ్చు. 2008లో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఆర్థిక మాంద్యం రోజుల నుంచి గల్ఫ్ దేశాలన్నీ విదేశీయుల్ని అనుమతించడానికి సంబంధించిన నిబంధనల్ని కఠినతరం చేస్తూ వస్తున్నాయి. పర్యవసానంగా అంతక్రితం దశాబ్దాలతో పోలిస్తే గల్ఫ్ దేశాలకు పోవడం కష్టమవుతోంది. కువైట్ ఇప్పుడు ఈ కొత్త చట్టం తీసుకొస్తే అంతంతమాత్రంగా వున్న అవకాశాలు మరింత తగ్గడం ఖాయం. అంతర్జాతీయ పరిణామాల కారణంగా చమురు ధరలు దారుణంగా పడిపోగా, ఈ తొలి త్రైమాసికంలో గల్ఫ్ చమురు, సహజవాయు ఎగుమతులు సైతం కుదేలయ్యాయి. గల్ఫ్ సంక్షోభ సమయం తర్వాత ఇదే మొదటిసారి. స్థిరాస్తి, ఆరోగ్య రంగం, హైటెక్ సెక్టార్లలో ఆ దేశాలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. వాటిపై మంచి రాబడి కూడా లభిస్తోంది. కానీ ఆ రంగాలన్నీ ఇప్పుడు కుంటు బడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో వలస ప్రజలను వీలైనంత మేర వదులుచ్చుకుందామని గల్ఫ్ దేశాలన్నీ చూస్తున్నాయి. ఆ దిశగా కువైట్ తొలి అడుగేసింది. వాస్తవానికి కరోనా వైరస్ మహమ్మారి ప్రతాపం చూపించడం మొదలెట్టిన నుంచీ గల్ఫ్ దేశాల్లో వుంటున్న వలస కార్మికులకు కష్టాలు అనేక రెట్లు పెరిగాయి. పశ్చిమాసియాలో వున్న కరోనా కేసుల్లో సగం యూఏఈ, కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రైన్ వంటి గల్ఫ్ దేశాల్లోనే వున్నాయి. లాక్‌డౌన్ కారణంగా అన్ని రంగాలూ స్తంభించిపోవడంతో వలస కార్మికులం దరినీ ఆ దేశాలు లేబర్ క్యాంపులకు తరలించాయి. వివిధ స్వచ్ఛంద సంస్థలు రోజూ ఇచ్చే ఆహారం పొట్లాలే అక్కడ తలదాచుకుంటున్నవారికి దిక్కయ్యాయి. లేబర్ క్యాంపుల్లో సదుపాయాలు అంతంతమాత్రంగా వున్నాయి. వాటిని సక్రమంగా నిర్వహించడం చేతకాక దాదాపు గల్ఫ్ దేశాలన్నీ చేతులెత్తేశాయి. ఏ దేశానికి ఆ దేశం తమ పౌరుల్ని వెంటనే ఇక్కడినుంచి తీసుకెళ్లాలంటూ అవి భారత్‌తోసహా అన్ని దేశాలనూ కోరాయి. పర్యవసానంగా కేంద్ర ప్రభుత్వం వందేభారత్ మిషన్ కింద భారీయెత్తున వలస కార్మికుల్ని వివిధ మార్గాల ద్వారా స్వస్థలాలకు తీసుకొచ్చింది.

# పరిషత్‌లకు ఆర్థికసంఘం నిధులు

### కేంద్ర నిర్ణయంతో నిధుల రాక
### అభివృద్ధి పనులకు తొలగనున్న అడ్డంకులు

హైదరాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): కొన్నేళ్లుగా నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న స్థానిక సంస్థలకు మళ్లీ నిధులు వచ్చి పడుతున్నాయి. జిల్లా, మండల పరిషత్‌లకు నిధులు బదిలీ అవుతున్నాయి. మండల పరిషత్‌లకు 10శాతం, జిల్లా పరిషత్‌లకు 5 శాతం నిధులను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. దీనికి సంబంధించిన విధివిధానాలు జిల్లా అధికారులకు అందాయి. ఇప్పటికే గత పాలక వర్గానికి 14వ ఆర్థిక సంఘం నిధులు అందకుండానే పదవీ కాలం ముగిసిపోయింది. మళ్లీ గతేడాది క్రితం కొత్త పాలకవర్గం పదవీ బాధ్యతలు చేపట్టింది. అయితే ఏడాది అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. ఎన్నికలయ్యాక ఆర్థిక సంఘం నిధులు మంజూరుకావడం ఇదే మొదటిసారి. జిల్లాల్లోని మండలాలకు నిధులను కేటాయించే అవకాశం ఉంది. గత ప్రభుత్వాల హయాంలో ఆర్థిక సంఘం నిధులు క్రమం తప్ప కుండా విడుదలయ్యేవి. కానీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా నిలిపి వేసింది. దీంతో జడ్పీ, మండల పరిషత్‌లకు ఆరేళ్లుగా నిధులు నిలిచిపోయాయి. నిధుల కొరతతో జడ్పీటీసీ, ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. పలుమార్లు ప్రభుత్వాలు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఎదురు చూపులు తప్పలేదు. ఎట్టకేలకు జిల్లా, మండల పరిషత్‌లకు 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొన్నేళ్లుగా నిలిచిపోయిన నిధులు విడుదల కావడంతో అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. సుదీర్ఘకాలం అనంతరం మంజూరైన 15వ ఆర్థికసంఘం నిధులను పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాకు కేటాయించిన నిధులను జనాభా ప్రాతిపదికన కేటాయిస్తారు. రెండు మూడు రోజుల్లో నిధుల కేటాయింపు పూర్తికానుందని పేర్కొంటున్నారు. అత్యవసర ఖర్చుల నిమితమే ఈ నిధులను వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గతంలో కేటాయించిన విధంగా కాకుండా తక్కువైనా ఆర్థిక సంఘం నిధులతో జిల్లా, మండల పరిషత్ పాలన గాడిలో పడే అవకాశం కనిపిస్తుంది. ప్రతి మూడు నెలలకోసారి విడుద లయ్యే ఆర్థిక సంఘం నిధుల మంజూరు ప్రారంభం కావడంతో జడ్పీటీసీ, ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ఆదాయం సమకూర్చే పనులను చేపట్టే వీలుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీలుగా గెలుపొందామనే సంతోషమే తప్ప నిధులు లేక పోవడంతో నిరాశనే మిగిలింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొన్ని హామీలైనా నెరవేరే అవకాశం ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తుంటే సభ్యులు నీళ్లు మింగే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొందరైతే నిధులు లేవన్న కారణంగా క్షేత్రస్థాయి గ్రామ పర్యటనలకు దూరంగానే ఉంటున్నారు. అలాగే సమావేశాల సమయంలోనే తప్ప కార్యాలయాలకు ఎవరూ రాకపోవడంతో కళ తప్పిపోతున్నాయి. నిధులు లేవన్న కారణంగా సభ్యులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు పై అంతగా ఆసక్తి చూపడం లేదు. అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యుల పరిస్థితి ఒకే విధంగా మారింది. అయితే ఇటీవల విడుదలైన నిధులతో కొంత ఊరట కలుగడంతో సభ్యులు కొత్త ఉత్సాహంతో కనిపిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన ఉత్తర్వులు అందాయని పంచాయితీ అధికారులు కూడా తెలిపారు. దీంతో జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయించేందుకు ఏర్పాట్లను చేస్తున్నట్లు వెల్లడించారు. మరో రెండు మూడు రోజుల్లో జిల్లాల్లోని మండల పరిషత్‌లకు నిధుల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేస్తామని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# చాపకింద నీరులా విస్తరిస్తున్న కరోనా

### హోం క్వారంటైన్‌లో ఉన్నవారికి కిట్లు

ఖమ్మం,జూలై16(ఆర్ఎన్ఎ): జిల్లాలో చాపకిందనీరులా ఉన్న కరోనా మహమ్మారి వ్యాపిస్తోంది. వారం రోజులుగా మరింత తీవ్రరూపం దాలుస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 1,701 కరోనా శ్యాంపిళు సేకరించగా 167 మందికి పాజిటివ్ నిర్ధారణైంది.

వారిలో 51మంది కోలుకోగా.. 105మంది వైద్యసేవలు పొందుతున్నారు. మొత్తం 11మంది మృతిచెందారు. కరోనా పాజిటివ్ నమోదై లక్షణాలు లేని వారికి ఇక ఇళ్లే ఐసోలేషన్ సెంటర్లు కానున్నాయి. ఇప్పటికే జిల్లాలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతుండగా వచ్చే రెండు నెలల్లో వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పాజిటివ్ వచ్చినా.. ఇంట్లోనే ఉండి వైద్యం చేసుకునేలా ప్రభుత్వమే కరోనా ఐసోలేషన్ కిట్లను అందజేయనుంది. ఇప్పటికే రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో ఈ కిట్లను కొనుగోలు చేసి పాజిటివ్ వచ్చిన వారికి అందజేస్తున్నారు. ఇదే రీతిలో ఖమ్మం జిల్లాలోనూ కిట్లు అంద జేయాలని నిర్ణయించిన కలెక్టర్ కర్ణన్..కరోనా పాజిటివ్ నమోదైన వ్యక్తులకు 17రోజులకు సరిపడా మందులు కరోనా ఐసోలేషన్ కిట్‌లో అందుబాటులోకి రానున్నాయి. కిట్‌లో శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు, హైడ్రాక్సీక్లోరొక్విన్, పారాసెటమాల్, యాంటిబయాటిక్స్, విటమిన్ సీ, ఈ, డీ3 మాత్రలు, ఎసీడీటిని తగ్గించే మాత్రలతో పాటు కరోనా పాజిటివ్ వచ్చిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పుస్తకం ఉంటాయి.

## గ్రామ రక్షక దళాలకు ప్రోత్సాహకాలు అందజేస్తాం

### -కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, జులై 16 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ కమిషనరేట్‌వ్యాప్తంగా చురుకుగా పనిచేస్తున్న గ్రామరక్షకదళాలకు ప్రోత్సాహకాలు అందజేస్తామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. గ్రామరక్షక దళాల్లోని సభ్యులందరూ చురుకుగా పనిచేస్తున్నారని, ఇందులో కొందరు అందించిన సమాచారంతో ఈ మధ్యకాలంలో 05నేరసంఘటనలను చేధించడం జరిగిందని పేర్కొన్నారు.

గ్రామరక్షకదళాలు చురుకుగా పనిచేస్తూ, కొందరు అనుమానితులకు సంబంధించిన సమాచారం అందిస్తుండటం ద్వారా అతిత్వరలో పెండింగ్‌లో ఉన్న మరిన్ని నేరాలను చేధించే అవకాశాలు లభించాయన్నారు. గ్రామరక్షక దళాల ఏర్పాటు, మరోపక్క రేయింబవళ్ళు పోలీసులు కొనసాగిస్తున్న గస్తీలతో నేరాలు నియంత్రణలోకి వచ్చాయని తెలిపారు. గతంలో ఈ గ్రామరక్షక దళాల్లో పనిచేసిన వారికి వయోభారం పెరగడంతో వారిని తప్పించి, యువతను ఇందులో సభ్యులుగా చేర్చుకున్నామని చెప్పారు. గ్రామరక్షకదళాల ఏర్పాటుతో గతంలో సత్ఫలితాలను సాధించిన పోలీసులు, అదేస్ఫూర్తితో ముందుకుసాగుతున్నారు.

**అప్రమత్తంగా ఉంటే ఎలాంటి సంఘటనలు జరుగవు**

కమీషనరేట్ వ్యాప్తంగా అనేకగ్రామాల్లో ప్రజలు చాలామంది తమకుటుంబాలతో కలిసి ఆరుబయట, డాబాలపై పడుకోవడంలాంటివి చేస్తుంటారు. ఇదే అదునుగా భావించి దోపిడి,దొంగతనాలకు పాల్పడిన సంఘటనలు గతంలో అనేకంగా జరిగాయి. సామాజిక చైతన్యంకోసం ఎన్నో విజయవంతమైన ఉద్యమాలకు ఊపిరిలూదిన కరీంనగర్‌జిల్లా పల్లెప్రజలు, పోలీసులు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాకు ప్రభావితమై తమగ్రామాల రక్షణకోసం గ్రామరక్షకదళాల్లో పనిచేసేందుకు స్వచ్ఛందంగా ముందుకువస్తున్నారు. దోపిడి,దొంగతనాలను అరికట్టేందుకు "తాముసైతం...."అంటూ గ్రామరక్షకదళాలు ఏర్పాటు చేసుకుని రాత్రిపూట గస్తీతిరుగుతూ ఈ ఉద్యమాన్ని సఫలీకృతం చేసేందుకు నడుంబిగించారు.

**నగదు పారితోషికాలు అందజేస్తున్నాం**

గ్రామరక్షకదళాల్లో చురుకుగా పనిచేస్తూ పలు దోపిడి,దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో అనుమానితులను గుర్తించడంతోపాటు, అనుమానితులకు సంబంధించిన సమాచారం అందించిన వారికి కమిషనరేట్ పోలీసుల తరపున నగదుపారితోషికాలను అందజేస్తున్నామని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ మధ్యకాలంలో రామడుగు మండలంలో జరిగిన దొంతనాలకు సంబంధించిన సమాచారం అందించిన గ్రామరక్షకదళాలకు చెందిన సభ్యులను సన్మానించడంతోపాటువారికి నగదుపారితోషికాన్ని అందించారు. గ్రామరక్షక దళాల పనితీరును సమీక్షించడంతోపాటు ప్రత్యక్షంగా పరిశీలిస్తూ ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్న రామడుగు ఎస్ఐ గొల్లపల్లి అనూషను పోలీస్ కమిషనర్ అభినందించారు. పలుగ్రామాల్లోని యవతను ప్రత్యక్షంగా కలిసి వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గ్రామరక్షక దళాల్లో చురుకుగా పనిచేసే సభ్యులకు నగదు ప్రోత్సాహకాలతోపాటు జిల్లాకేంద్రంలో ప్రభుత్వం తరపున జరిగే కార్యక్రమాల సందర్భంగా ప్రశంసాపత్రాలను అందజేస్తామని ప్రకటించారు.

**గ్రామరక్షకదళాలతో దోపిడీ,దొంగతనాల నియంత్రణ**

ఆధునికసాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో వివిధరకాల నేరాల ఛేదనలో సఫలీకృతమవుతున్న పోలీసుకు గ్రామరక్షకదళాల సంచారం, వారందిస్తున్న సమాచారంతో ప్రత్యేకనిఘాను కొనసాగిస్తూ దోపిడి,దొంగతనాల నియంత్రణకు పగడ్బందీచర్యలను తీసుకుంటున్నారు. అన్నివర్గాల ప్రజల సహకారం, టెక్నాలజీ వినియోగంతో సత్ఫలితాలను సాధిస్తూ దేశంమొత్తం కరీంనగర్ వైపు చూసేలా తమవంతు పాత్రకు నూటికినూరుశాతం అంకితభావంతో పనిచేస్తూ నేరాలనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో పోలీసులకు అందిస్తున్న సహకారం ఇలాఅనికూడా అభివర్ణించేందుకు పదాలకు సైతం డిక్షనరీలలోకూడా చిక్కకుండా ఉన్నాయి.

**గ్రామరక్షకదళాలతో లాభాలు....**

సహజంగా తెలిసో తెలియకో దాదాపు 25శాతం పోలీసుల విధులను ప్రజలే నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని చాలామంది యువకులు వారివారి ప్రాంతాల్లో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు వారికున్న సామాజికస్ఫృహతో, ధైర్యసాహసాలతో వెంటనే స్పందించి, అందులో నష్టపోయినవారిని ఆదుకుంటున్నారు. మరికొందరైతే అనుమానిత వ్యక్తులను నేరస్థులుగా భావించి చాలాసార్లు పోలీసులకు పట్టించే సాహసాలుకూడా చేసి ఆదర్శప్రాయంగా నిలిచారు. అదేస్ఫూర్తిగల యువకులతో కలిసి ప్రతిగ్రామంలో గ్రామరక్షకదళాలను ఏర్పాటు చేసుకోవడంతోపాటు నేరాలసంఖ్యను తగ్గుముఖం పట్టించే చర్యలతోపాటు, ప్రతినిత్యం పల్లెప్రజలు ఎదుర్కొంటున్న ఎన్నో సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి అవకాశం ఏర్పడింది.

నేరాలను నియంత్రించేందుకు పోలీసులపై ఉన్నఒత్తిడితగ్గి, వారు నేరపరిశోధనలపై దృష్టిసారించేందుకు వీలుకలుగుతోంది.

నేరాలు జరిగేతీరు ప్రజలకు తెలియజేయడంవల్ల ప్రజల్లో చైతన్యం పెరిగి, నేరస్థులు సులువుగా దొరికేఅవకాశం ఉంది.

నేరాల పరిశోధనకయ్యే కోట్లాదిరూపాయల ప్రజాధనం ఖర్చును తగ్గించవచ్చు.

అసాంఘీకశక్తుల వైపు ఆకర్షింపబడకుండా యువతలో క్రమశిక్షణ పెంపొందించేందుకు దోహదపడుతుంది.

యువశక్తిని నిర్వీర్యం చేసే మాదకద్రవ్యాలు,మద్యం, తదితర పెడతోవపట్టకుండా నిరోధించవచ్చు.

వ్యసనాలకు బానిసలై ప్రాణాంతకవ్యాధుల బారినపడే అవకాశాలు ఉండవు, వారిలో ఏర్పడే క్రమశిక్షణ ఇందుకు దోహదపడనుంది.

మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత,అవినీతి తదితర సాంఘీకదురాచారాలను అరికట్టవచ్చు.

"సమాజంలోని ప్రతిపౌరుడు తాను యూనిఫారంలేని పోలీసు"అనేభావం పెంపొందుతున్నది.

**గ్రామరక్షకదళాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలిస్తాం**

**పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి**

గ్రామరక్షకదళాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కమిషనరేట్‌లోని వివిధ ప్రాంతాలకు ఆకస్మికంగా వెళ్ళి పరిశీస్తామని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. అన్నివర్గాలకు చెందిన ప్రజలకు సేవలందించేందుకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగస్వాములమవుతామంటూ స్వచ్ఛంగా ముందుకువస్తున్న వారికి ఆహ్వానం పలికారు. వివిధ సందర్భాలలో సమయస్ఫూర్తిని ప్రదర్శించి, గుర్తింపుతెచ్చుకోవడం తమబాధ్యతగా ప్రతిపౌరుడు గుర్తించాలని చెప్పారు.

## శ్రీవారి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానం

తిరుమల,జూలై16(ఆర్ఎన్ఎ): శ్రీవారి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానంను తితిదే వైభవంగా నిర్వహించింది. తమిళనాడులోని శ్రీరంగం ఆలయం నుంచి తీసుకువచ్చిన పట్టు వస్త్రాలను ఊరేగింపుగా స్వామివారి సన్నిధికి తీసుకొచ్చారు. మందిరంలోని బంగారు వాకిలి వద్ద ఘంటా మండపంలో ఉభయ నాంచారులతో కూడిన మలయప్పస్వామివారిని గరుత్మంతునికి అభిముఖంగా ఆశీనులు చేసి పాలు, తేనె, పచ్చ కర్పూరం, సుగంధమైన పరిమళాలతో అభిషేకాలు నిర్వహించారు. అదే సమయంలో గర్భాలయంలోని శ్రీవారి మూలమూర్తి ఎదుట.. గత ఏడాది పొడవునా ఎంత ఆదాయం వచ్చింది, అందులో భక్తుల అవసరాలు, దేవస్థానం అభివృద్ధి కోసం ఎంత ఖర్చు చేసింది తితిదే అధికారులు, అర్చకులు లెక్కలు చెప్పారు. ఆదాయ వ్యయాల నివేదన పూర్తయిన తర్వాత అర్చకులు పెద్దజీయర్, చిన్న జీయర్, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ 'లచ్చన' అనే తాళపు చెవిని మూలవిరాట్టు పాదాల చెంత ఉంచారు. ఈవో సమక్షంలో తితిదే ఖజానాకు జమచేయడంతో నూతన లెక్కలు ప్రారంభమయ్యాయి. ఆణివార ఆస్థానంను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

## 13నెలల పాలనలో పెరిగిన దాడులు

### టిడిపి నేతలపై కక్షసాధింపు చర్యలు

### జగన్ పాలనపై రాష్ట్రపతికి టిడిపి ఎంపిల ఫిర్యాదు

న్యూఢిల్లీ,జూలై16(ఆర్ఎన్ఎ): తెలుగుదేశం పార్టీ ఎంపీల బృందం గురువారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసింది. ఈ సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్‌లో 13 నెలల కాలంలో దాడులు పెరిగిపోయాయని రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. వైకాపా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు, కేశినేని, కనకమేడల రవీంద్రకుమార్ తదితరులు రాష్ట్రపతిని కలిసిన వారిలో ఉన్నారు. ఈసందర్భంగా టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఏపీ సీఎం జగన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని, ఆయనకు అనుకులంగా ఉండే విధంగా మలుచుకుంటున్నారని ఆరోపించారు. గత 13 నెలలుగా రాష్ట్రంలో నెలకొన్న దౌర్జన్యకర వాతావరణం, రాష్ట్రంలో చోటుచేసుకొంటున్న ఘటనల గురించి వారు రాష్ట్రపతికి వివరించామని అన్నారు. టీడీపీ నేతలపై కక్షపూరితంగా దాడులు చేయడం, రాష్ట్రంలో పౌరుల ప్రాథమిక హక్కులు కాలరాయడం, రాజ్యాంగ వ్యవస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తులు, సంస్థలపై దాడులు, పేదల భూములు లాక్కోవడం, ప్రతిపక్షాలకు చెందిన వారిపై హింస, దౌర్జన్యాలు, ఆస్తుల ధ్వంసం, దళితులపై దాడులు తదితర విషయాలను రాష్ట్రపతికి వివరించామన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కాపాడాలని రాష్ట్రపతిని కోరామని రామ్మోన్ నాయుడు చెప్పారు. దీనిపై రామనాథ్ కోవింద్ సానుకూలంగా స్పందిచారని, ఈ విషయాలన్ని తన దృష్టికి వచ్చాయని చెప్పారని, దీనిపై విచారణ చేసి తగు చర్యలు తీసుంటామని హామీ ఇచ్చారని ఎంపీ రామ్మోహన్ తెలిపారు. రోజు రోజుకు ఏపీలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అందుకే తాము రాష్ట్రపతిని కలిసి అన్ని విషయాలు వివరించామన్నారు.

## క్లీన్ రైల్వేస్‌గా నిలుస్తాం: పీయూష్

న్యూఢిల్లీ,జూలై16(ఆర్ఎన్ఎ): 2030 నాటికి ప్రపంచంలోనే తొలి క్లీన్ రైల్వేస్‌గా నిలుస్తామని కేంద్ర రైల్వే మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) గురువారం నిర్వహించిన

కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. రానున్న మూడున్నర ఏండ్లలో రైల్వేలో వంద శాతం విద్యుత్తీకరణ జరుగుతుందన్నారు. మరో పది ఏండ్లలో దేశంలోని ప్రతి పౌరుడికి భారతీయ రైల్వే గర్వంగా నిలుస్తుందని, ప్రపంచంలోనే అతి పెద్ద క్లీన్ రైల్వేస్‌గా ఉంటామని ఆయన చెప్పారు.

అంతర్జాతీయ పునరుత్పాదక రంగంలో భారత్ ప్రధాన పాత్ర పోషిస్తోందని పియూష్ గోయల్ తెలిపారు. ప్రధాని మోదీ పిలుపునిచ్చిన 'వన్ సన్, వన్ వరల్డ్, వన్ గ్రిడ్' నినాదంతో అంతర్జాతీయ సోలార్ గ్రిడ్‌కి భారత్ అనుసంధానమైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పీఎం కుసుమ్ పథకం ద్వారా పునరుత్పాదక విద్యుత్ వినియోగానికి రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పియూష్ గోయల్ వివరించారు.

## లారీని ఢీకొన్న గూడ్స్

భువనేశ్వర్,జూలై16(ఆర్ఎన్ఎ): ఒక లారీని గూడ్సు రైలు ఢీకొట్టిన ప్రమాదంలో ఆ లారీ నుజ్జునుజ్జు అయ్యింది. ఒడిశాలోని పారాదీప్ పోర్టు సమీపంలోని నిషేధిత జేఎస్‌డబ్ల్యూ ప్రాంతంలో గురువారం ఈ ఘటన జరిగింది. పట్టాలమీదుగా వెళ్తున్న లారీని గూడ్సు రైలు ఢీకొట్టింది. దీంతో లారీ మధ్యభాగం విరిగిపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన నేపథ్యలంలో గూడ్సు రైలు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. రైల్వే అధికారులు ఘటనా స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అదుపుతప్పి గుంటలో పడ్డ కారు: ఆరుగురు మృతి

చెన్నై,జూలై16(ఆర్ఎన్ఎ): తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని పత్తిరి గ్రామం వద్ద ఓ కారు అదుపుతప్పి గుంటలో పడటంతో ఆరుగురు మరణించారు. మృతుల్లో ఒక చిన్నారి కూడా ఉన్నది. తిరునల్వేలి జిల్లా నుంచి చెన్నై వెళ్తుండగా గురువారం తెల్లవారుజామున కారు అదుపుతప్పి పక్కనే ఉన్న గుంటలో పడిపోయింది. దీంతో డ్రైవర్ సహా, అందులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతిచెందారని విల్లుపురం ఎస్పీ ఎస్ రాధాకృష్ణన్ వెల్లడించారు. కారులో మరో ఇద్దరు చిన్నారులు ఉన్నారని, వారు తీవ్రంగా గాయపడ్డారని, వారిని దవాఖానకు తరలించామని చెప్పారు. డ్రైవర్ నిద్రపోవడంతోనే ప్రమాదం జరిగిందని వెల్లడించారు. ప్రమాదంపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు జరుగుతున్నదని తెలిపారు.

## కరోనాకు మాజీ ఐఎఎస్ అధికారి మృతి

ముంబై,జూలై16(ఆర్ఎన్ఎ): మాజీ ఐఏఎస్ అధికారిణ, మహారాష్ట్ర మొదటి మహిళా ఎన్నికల కమిషనర్ నీలా సత్యనారాయణ్ కరోనాతో మరణించారు. 72 ఏండ్ల సత్యనారాయణ్ కొన్నిరోజులుగా కరోనా బాధపడుతున్నారు. ఆమె ముంబైలోని సెవన్ హిల్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఈ రోజు ఉదయం 8 గంటలకు మరణించారని హాస్పిటల్ అధికారులు ప్రకటించారు.

1972 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన నీలా సత్యనారాయణ్ 2014, జూలై 5న రిటైర్ అయ్యారు. పదవీ విరమణకు ముందు మహారాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు మొదటి మహిళా కమిషనర్‌గా 2009లో నియమితులయ్యారు. రచయిత కూడా అయిన ఆమె పదవీ విరమణ తర్వాత అనేక పుస్తకాలు రాశారు. పలు సినిమాలకు సాహిత్యం కూడా అందించారు. ఆమె రాసిన రౌన్ అనే నవల ఆధారంగా మరాఠీలో సినిమా కూడా రూపొందింది. మొత్తంగా సత్యనారాయణ్ 23 పుస్తకాలు రాశారు.

## న్యూయార్క్‌లో బంగ్లా వ్యాపారి హత్య

### -రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

న్యూయార్క్,జూలై16(ఆర్ఎన్ఎ): న్యూయార్క్ నగరంలో బంగ్లాదేశ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త దారుణ హత్యకు గురయ్యారు. రవాణ, ఫుడ్ డెలివరీ సేవలు అందించే సంస్థ సహవ్యవస్థాపకుడు ఫాహిమ్ సలేహ్‌ను తన విలాసవంతమైన ఫ్లాట్‌లో గుర్తితెలియని వ్యక్తులు హత్య చేశారు. ఆయన సోదరి అక్కడకు వచ్చే సరికి ఫాహిమ్ మృతదేహాన్ని దుండగులు ముక్కలు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హత్య జరిగిన తీరు చూసి ఎవరో అనుభవం ఉన్న హంతకులే ఈ దారుణానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఫాహిమ్ సోదరి అక్కడకు వచ్చే వరకు హంతకుడు ఫ్లాట్‌లోనే ఉన్నట్లు భావిస్తున్నారు. ఆమె రాకతో అలికిడి కావడంతో నిందితులు పారిపోయిఉంటారని పోలీసులు చెబుతున్నారు. సీసీకెమేరా ఫుటేజీని పరిశీలించగా ఒక వ్యక్తి ఫాహిమ్ వెనుకనే వచ్చినట్లు గుర్తించారు. సౌదీ అరేబియాలో ఓ బంగ్లాదేశ్ జంటకు పుట్టిన ఫాహిం న్యూయార్క్‌లోనే పెరిగాడు. 33 ఏళ్ల ఈ వ్యాపారవేత్త స్థాపించిన పథావ్ సంస్థ బంగ్లాదేశ్‌లో రవాణ, ఫుడ్ డెలివరీ, చెల్లింపుల రంగాల్లో సేవలు అందిస్తోంది. దీని మార్కెట్ విలువ 100 మిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. నైజీరియాలో 'గోకడ' అనే సంస్థలు స్థాపించాడు. ఇది ట్యాక్సీ సర్వీసులు, డెలివరీ సేవలను అందిస్తుంది. దీనిలో ఫాహిమ్ 6.9మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టారు.

# ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కరోనా కేసులు

### మాస్కులు ధరించడం..భౌతిక దూరం పాటించడంలో నిర్లక్ష్యం

### వైద్యశాఖ సమన్వయ లోపంతో కేసుల సంఖ్యపై గందరగోళం

అదిలాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కరోనా పాజిటివ్ కేసుల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. గల్ఫ్‌తో పాటు, ముంబై, హైదరాబాద్ నుంచి వచ్చిన కార్మికులతో గ్రామాల్లో సైతం కరోనా విస్తరిస్తోంది. ఈ విషయంలో లెక్కలు సరిగా లేవన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. జనం లాక్‌డౌన్‌కు ముందు అలాగే లాక్‌డౌన్‌లోనూ ఎంతో జాగ్రత్తగా ఉన్నప్పటికీ ప్రస్తుతం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మాస్కులు ధరించకపోవడం, భౌతికదూరం పాటించకపోవడం లాంటి వాటితో పాటు విందులు, వినోదాల్లో పాల్గొనడం, షాపింగ్‌లు, మార్కెటింగ్‌లు జోరు గా చేస్తుండడం, గుంపులు గుంపులుగా తిరుగుతుండడం లాంటి పరిణామాలన్నీ కరోనావైరస్‌వ్యాప్తికి కారణమవుతున్నాయి. మొదట పోలీసులు కఠినంగా వ్యవహరించి వ్యాప్తిని కట్టడి చేయగలిగారు. అయితే లాక్‌డౌన్ అనంతరం పరిస్థితి మారిపోవడంతో నిర్లక్ష్యధోరణి ప్రజల్లో పెరిగిపోయింది. దీనికి తోడు కరోనా సమాచారం, హోం క్వారంటైన్, ఐసోలేషన్ సమాచారం స్పష్టంగా తెలియకపోవడం కూడా నిర్లక్ష్యానికి తోడవుతోందని అంటున్నారు. కరోనావైరస్ వ్యాప్తి తీవ్రంగా కొనసాగుతున్నట్లు అధికారులు ప్రచారం చేసినట్లయితే కొంతమేరకైనా జనం కట్టడికి లోబడి ఉండేవారంటున్నారు. ప్రస్తుతం కట్టడి నిర్వీర్యమైపోయిందని, జనం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. రాష్ట్రస్థాయిలో విడుదలయ్యే హెల్త్ బులెటిన్‌లో జిల్లాకు సంబంధించిన వివరాలు ఒక రకంగా, జిల్లాస్థాయి హెల్త్‌బులెటిన్‌లో పాజిటివ్ కేసులకు సంబంధించిన వివరాలు మరోరకంగా ఉండడంతో అంతటా అయోమయం నెలకొంటోంది. వైద్య, ఆరోగ్యశాఖ సమన్వయలోపంతోనే గత కొద్ది రోజుల నుంచి ఇలాకరోనాపై అస్పష్టమైన వివరాలు వెల్లడవుతున్నాయన్న ఫిర్యాదులున్నాయి. వైద్య,ఆరోగ్యశాఖ యంత్రాంగం కరోనా విషయంలో పక్కా సమాచారాన్ని ఇవ్వడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వివరాలు సైతం పకడ్బందీగా జారీ చేయాలంటూ ఆదేశించినప్పటికీ వైద్యారోగ్యశాఖ పనితీరులో మాత్రం మార్పు కనిపించడం లేదంటున్నారు. కరోనా పాజిటివ్ వచ్చిన వారితో పాటు ఐసోలేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారు, హోం క్వారంటైన్‌లో ఉన్న వారు, గాంధీ ఆసుపత్రికి, రిమ్స్ ఆసుపత్రులకు తరలించిన వారి విషయంలో కూడా అధికారులు అస్పష్టమైన సమాచారాన్ని ఇస్తున్నట్లు విమర్శలున్నాయి. ఓ అధికారి చెప్పేదానికి మరో అధికారి చెప్పే దానికి పొంతన లేకుండా పోతుందని పేర్కొంటున్నారు. కోవిడ్‌కు సంబందించిన నోడల్ అధికారి తీరుపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అయిన అంశం చర్చనీయాంశం అయ్యింది. ఇలా గత మూడు నెలల నుంచి కరోనా విషయంలో సంబందిత యంత్రాంగం అనుసరిస్తున్న విధానం పట్ల అనేక ఆక్షేపణలు కొనసాగుతున్నాయి. కరోనా పాజిటివ్ కేసుల తీవ్రత పెరుగుతున్నప్పటికి అధికారులు వాస్తవాలను వెల్లడించడం లేదంటున్నారు. దీని కారణంగానే జనం మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భౌతిక దూరం నిబంధనను, మాస్కులు ధరించడం లాంటి వాటిని ఉల్లంఘిస్తున్నారంటున్నారు. వాస్తవానికి ప్రతిరోజూ దీనికి సంబంధించిన హెల్త్ బులెటిన్‌ను విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఈ నిబందనను ఉల్లంఘించారంటున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి మాత్రమే ఈ హెల్త్ బులెటిన్‌ను విడుదల చేస్తున్నప్పటికీ ఇందులో కూడా వివరాలన్నీ తప్పుల తడకగా ఉంటున్నాయన్న ఆరోపణలున్నాయి. ఏ రోజు వివరాలను అదే రోజు ప్రకటించాల్సి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఆలస్యంగా ఆ వివరాలను రాత్రివేళ జారీ చేస్తున్నారు. దీంతో మరుసటి రోజుకు సంబంధించిన కరోనా సమాచారమంతా గడబిడగా మారుతోంది. హోం క్వారంటైన్‌లో ఎంతమంది ఉన్నారనే విషయంతో పాటు ఎంతమంది శాంపిళ్ళను సేకరించి ల్యాబ్‌కు పంపారోననే విషయంలో కూడా అధికారులు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా వ్యవహరిస్తున్నారంటున్నారు.

# ఉమ్మడి కరీంనరగ్ జిల్లాలో మళ్లీ పెరిగిన కేసులు

### మరోమారు లాక్‌డౌన్ విధిస్తేనే మేలంటున్న జనం

### సొంతంగా కట్టడి విధించుకుంటున్న వ్యాపారులు

కరీంనగర్,జూలై16(నేటినిజం ప్రతినిధి): కరోనా కట్టడిలో తెలంగాణకు ఆదర్శంగా నిలిచిన కరీంనగర్ జిల్లాలో ఇప్పుడు కరోనా వైరస్ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. రికార్డు స్తాయిలో కేసులు పెరగడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కరీంనగర్‌లో రికార్డు స్థాయిలో కరోనా కేసులు నమోదవుతున్నందున ప్రభుత్వం లాక్‌డౌన్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పాజిటివ్ కేసులు వస్తున్న ప్రాంతాల్లో కట్టడి మాత్రం కనిపించడం లేదు. వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్లు, సిబ్బంది పాజిటివ్ నిర్ధారణ ప్రాంతాల్లో విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి అత్యధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. కరీంనగర్ ముకరంపుర, కశ్మీరుగడ్డలో ప్రారంభమైన ఈ వ్యాధి దాదాపు నగరంలోని 60 డివిజన్లకు పాకింది. ఇక్కడ, అక్కడ అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ఒక్కరికో, ఇద్దరికో ఇప్పటికే రాగా, కొన్ని ప్రాంతాల్లో ఇంట్లోని వారందరూ కరోనా బారిన పడ్డారు. ఓవైపు ఈ వ్యాధి వేగంగా విస్తరిస్తుంటే కట్టడి చేయాల్సిన అధికారయంత్రాంగం పట్టించుకోవడం లేదని, ఇది కూడా వేగంగా వ్యాధి వ్యాపించడానికి కారణమేనంటూ పలువురు విమర్శిస్తున్నారు. మార్చిలో కరీంనగర్‌కు వచ్చిన 10 మంది ఇండోనేషియన్లకు కరోనా నిర్ధారణ కావడంతో వారు బస చేసిన కశ్మీరుగడ్డ, ముకరంపుర ప్రాంతాలను కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించారు. ఆ ప్రాంతం నుంచి ఎవరూ బయటకు రాకుండా, ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా దిగ్బంధం చేశారు. దీంతో కరోనాను కట్టడి చేయగలిగారు. కరోనా వ్యాధిగ్రస్తులతో ప్రైమరీ కాంట్రాక్టులో ఉన్న వారందరిని గుర్తించి వారిని హోం క్వారంటైన్ చేయడంతోపాటు వారి చేతులపై ముద్రలు వేసి, బయటకు వస్తే సమాచారమివ్వాలంటూ పరిసరాల ప్రజలను అప్రమత్తం చేశారు. లాక్‌డౌన్ నిబంధనలను ఎత్తివేసిన తర్వాత ప్రభుత్వం, జిల్లా పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వివరిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వ్యాధిగ్రస్తులను గుర్తించి హోం ఐసోలేషన్‌లోనే చికిత్స అందించి చేతులు దులుపుకుంటున్నారని అంటున్నారు. పోలీసుల పర్యవేక్షణ లేకుండా పోయిందని, మున్సిపల్ అధికారులు కూడా సరిగా శానిటైజేషన్ చేయడం లేదని విమర్శిస్తున్నారు. దీంతో వ్యాధి సోకిన ప్రాంతాల్లోని ప్రజలు తీవ్రభయాందోళనలకు గురవుతున్నారు. వ్యాపారులే స్వచ్ఛందంగా దుకాణాలను మూసి వేస్తుండగా, కొన్ని ప్రాంతాల్లో స్థానికులే కట్టడి చేసుకుంటున్నారు. రెసిడెన్సీలో కూడా యజమానులే ప్రధాన ద్వారాన్ని మూసివేసి బోర్డును ఏర్పాటు చేసుకున్నారు. విద్యా సంస్థలను ప్రారంభించక పోవడంతో ఇప్పటికే చాలా మంది తమ గ్రామాలకు వెళ్లిపోయారు. సిరిసిల్ల పట్టణంలో 19 సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. సిరిసిల్ల, వేములవాడలో ప్రైవేటు నర్సింగ్‌హోం డాక్టర్లు వైరస్ బారినపడడంతో ఆ ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకున్న వారు ఆందోళన చెందుతున్నారు. వ్యాపార సంస్థలను సాయంత్రం 6గంటలలోపే మూసి వేస్తున్నారు. మండల కేంద్రాల్లో మధ్యాహ్నం వరకే కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రజలే స్వచ్ఛందంగా లాక్‌డౌన్ విధించుకొని జాగ్రత్త పడుతున్నారు. అయినా మహమ్మారి ఎవరినీ వదలకుండా కలకలం రేపుతోంది. ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటించాలని, తప్పని సరిగా మాస్కులు ధరించాలని సూచించారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని, స్వీయ నియంత్రణ పాటించాలని అన్నారు.

# సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నా పట్టించుకోరేం

### ఉస్మానియా చెరువైనా స్పందన ఏదీ

### ఉస్మానియాను కూలగొట్టి కడతామన్న హామీఏమైంది?

### ఆసుపత్రిని సందర్శించిన బిజెపి బృందం

### కరోనాపై సర్కార్ చేతులెత్తేసిందన్న బండి సంజయ్

హైదరాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ఓ వైపు కరోనా బాధితుల తాకిడి.. మరో వైపు మురుగునీటితో ఉస్మానియా ఆసుపత్రిలో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఈనేపథ్యంలో భాజపా నేత రామచంద్రరావు తదితరులతో కలిసి బండి సంజయ్ గురువారం ఉస్మానియా ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస వసతులపై నోరు విప్పడం లేదన్నారు. ముఖ్యమంత్రికి ప్రాజెక్టులపై ఉన్న శ్రద్ధ శిథిలావస్థకు చేరిన ఆసుపత్రులపై లేదని విమర్శించారు. ఆసుపత్రుల్లో డీపీఆర్‌లు ఉండవు కాబట్టి ముఖ్యమంత్రి ఇటువైపు దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో దోపిడీని అరికట్టడంలో సీఎం విఫలమయ్యారన్నారు. కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలని అడిగితే కనీసం స్పందించలేదన్నారు. ఉస్మానియా ఆసుపత్రి కూలే స్థితిలో ఉందని ...వెంటనే సీఎం ఆసుపత్రిని సందర్శించాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా ఆసుపత్రి అభివృద్ధిపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని బండి సంజయ్ అన్నారు. వానపడితే ఉస్మానియా ఆస్పత్రి చెరువుగా మారిందన్నారు.

ప్రభుత్వం ఎన్ని చెబుతున్నా తెలంగాణ ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలగడంలేదు. కోవిడ్ బాధితులకు ఆక్సిజన్ కొరత ఉందంటూ పదేపదే ఆరోపణలు వస్తున్న తరుణంలో నిన్న గాంధీ ఆస్పత్రిలో ఒకరు మృతి చెందారు. ఆక్సిజన్ పెట్టనందునే అతను చనిపోయినట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. తెలంగాణలో కోవిడ్ పేషెంట్లకు గాంధీలో చికిత్స అందిస్తున్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. కానీ పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. నిన్న గాంధీలో ఆక్సిజన్ అందక ఒకరు మృతి చెందడమే ఇందుకు నిదర్శనం. ఉస్మానియాను పునర్నిర్మిస్తానని చెప్పి కెసిఆర్ మాటతప్పారని బండి సంజయ్ అన్నారు. సోషల్ మీడియాలో హాట్ టాపిక్ ఉస్మానియ ఆస్పత్రి చక్కర్లు కొట్టినా ప్రబుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇంత జరుగుతున్న ఎవరు పటించుకోవడం లేదు. ఈ కేసీఆర్ ప్రభుత్వానికి సోయి లేదు. ఇక్కడ ప్రజల ప్రాణాలు పోతుంటే.. సీఎం ఫామ్ హౌజ్ కి పరిమితం అయ్యాడు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో కరోనా వైద్యానికి లక్షలు దండుకుంటున్నారు.. శవాల మీద పైసలు ఏరుకుంటున్నారు. ఆ ఖర్చు తట్టుకోలేక ప్రభుత్వ ఆస్పత్రులకు ఒక రోగంతో వెళ్తే... అక్కడి నుండి మరో పది రోగాలు వెంటబెట్టుకొని రావాల్సి వస్తోంది. ఇంతక ముందు ఉస్మానియాని కూలగొట్టి కొత్తగా కడతాను అని సీఎం కేసీఆర్ మాట ఇచ్చాడు. ఇప్పుడు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. పైగా బీజేపీ కేసులు వేసి అడ్డుకుంది అంటున్నారు. మరి కాళేశ్వరం, సెక్రటేరియట్ విషయాల్లో కూడా కేసులు వేశాం. మరి వాటిని ఎలా కట్టారు అని సంజయ్ ప్రశ్నించారు.

# మరో ఆరు జిల్లాలకు ఆరోగ్యశ్రీ సేవల విస్తరణ

### ఐదు లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారికి ఆరోగ్య శ్రీ వర్తింపు

### వైద్యం కోసం ఎవరూ అప్పులు పాలు కాకుండా పథకం అమలు

### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన సిఎం జగన్

అమరావతి,జూలై16(ఆర్ఎన్ఎ): ఆరోగ్యశ్రీలో మరో నూతన శకానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గురువారం నుంచి మరో ఆరు జిల్లాలకు ఆరోగ్యశ్రీ విస్తరణ సేవలను ప్రారంభించారు. వైద్య ఖర్చులు రూ.వెయ్యిదాటితే ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా ఆరోగ్యశ్రీలో పలు మార్పులు చేసి తొలుత పైలట్ ప్రాజెక్టుగా దీన్ని పశ్చిమ గోదావరి జిల్లాలో జనవరి 3 నుంచి అమలు చేస్తున్నారు. గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. తాజాగా విజయనగరం, విశాఖ, గుంటూరు, ప్రకాశం, వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో అమల్లోకి తీసుకు రానున్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిని విస్తృతంగా పెంచుతున్నామని తెలిపారు. ఐదు లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారికి ఆరోగ్య శ్రీ వర్తింపు చేస్తామని తెలిపారు. ఆస్పత్రులకు గ్రేడింగ్ విధానం అమలు చేస్తామని పేర్కొన్నారు. కరోనాను కూడా ఆరోగ్యశ్రీ




పరిధిలోకి తెచ్చిన ఏకైక రాష్ట్రం ఏపీ. వైద్యం కోసం ఎవరూ అప్పులు పాలు కాకూడదు. కోటి 42 లక్షల మందికి ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చాం. నాడు-నేడుతో ఆస్పత్రుల రూపు రేఖలు మారుస్తామని సీఎం జగన్ తలిపారు. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు చేస్తామని సీఎం తెలిపారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు గత ప్రభుత్వ బకాయిలన్నింటినీ చెల్లించామని పేర్కొన్నారు. అధికారంలోకి రాకముందు ఆరోగశ్రీలో 1059 చికిత్సలు ఉంటే..ఇప్పుడు ఆరోగ్యశ్రీని 2200 చికిత్సలకు పెంచామని వెల్లడించారు. త్వరలో అన్ని జిల్లాలకు ఆరోగ్యశ్రీ అదనపు సేవలు వర్తింపు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 27 టీచింగ్ ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన మందులు అందుబాటులోకి తీసుకొచ్చాం. డబ్ల్యూహెచ్‌వో సూచించిన మందులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. వైద్యం కోసం ఎవరూ కూడా అప్పుల పాలు కావొద్దని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచుతామని జగన్ అన్నారు. వైద్య ఖర్చు రూ. వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీని వర్తింపజేస్తూ పశ్చిమ గోదావరి జిల్లాను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి అమలు చేశామని అన్నారు. ఈ పథకం విజయవంతం కావడంతో కడప, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, విజయనగరం, విశాఖ పట్నం జిల్లాలో విస్తరించినట్లు ప్రకటించారు. ఆరోగ్యశ్రీలో మొత్తం 2,200 రకాల రోగాలకు వైద్య చికిత్సలు అందించనున్నామని పేర్కొన్నారు. ఈ పథకాన్ని అన్ని జిల్లాకు విస్తరిస్తామని వెల్లడించారు. ఇప్పటివరకు ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స అందించిన ఆస్పత్రులకు బకాయిలన్నింటిని చెల్లించామని జగన్ తెలిపారు.

## సిద్దిపేటలో ఒక్కరోజే 38 కేసులు

### సంగారెడ్డిలో 20 ,సూర్యాపేటలో12 నమోదు

హైదరాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా..రోజురోజుకూ తెలంగాణ రాష్ట్రంలో కోవిడ్-19 పాజిటివ్ కేసులు పెరిగి పోతున్నాయి. ఈ నేపథ్యంలో సిద్దిపేట జిల్లాలో ఉద్ధృతంగా కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. జిల్లాలో ఒక్కరోజే 38 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్య శాఖ అధికారులు వెల్లడించారు.సిద్దిపేట పట్టణంలో 10, రాయపోల్ లో 7, చందాపూర్ లో 6, ఇబ్రహీంనగర్ లో 5, హుస్నాబాద్ లో 4, గజ్వేల్ లో 2, రామవరం, దుబ్బాక, తొగుట, మేడిపల్లి గ్రామాల్లో ఒక్కో పాజిటివ్ కేసు నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్ లో పని చేస్తున్న ఆరుగురు కార్మికులకు కరోనా పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఇబ్రహీంనగర్ లో ఒకే కుటుంబంలో ఐదుగురికి కరోనా పాజిటివ్ రాగా, జిల్లాలో ఈ రోజు 41 మంది అనుమానితుల శాంపిల్స్ సేకరించారు.మొత్తం 61 మంది సాంపిల్స్ ఫలితాలను పెండింగ్ లో పెట్టారు. జిల్లాలో పెరుగుతున్న పాజిటివ్ కేసులతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో కొత్తగా 20 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్య అధికారులు వెల్లడించారు. కరోనా వల్ల ఒకరు మృతి చెందారని చెప్పారు. సూర్యాపేట పరిధిలో కొత్తగా 12 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్య శాఖ అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 209 కరోనా వైరస్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 117 మంది కరోనా బాధితులకు చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కరోనా వల్ల ఐదుగురు మృతి చెందినట్లు అధికారులు చెప్పారు.

## అయోధ్య బౌద్ధ్యక్షేత్రం అంటే బౌద్ధులు ధర్నా

### యునెస్కోకు అందించాలంటూ ఆందోళన

లక్నో,జూలై16(ఆర్ఎన్ఎ): అయోధ్యలో బౌద్ధ సన్యాసులు బుధవారం నాడు ఉపవాస దీక్షతో పాటు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. రామజన్మ పరిసరాలు వాస్తవానికి బౌద్ధ క్షేత్రం అని పేర్కొంటూ ఆ స్థలంలో యూనెస్కోతో తవ్వకాలు జరపాల్సిందిగా డిమాండ్ చేశారు. అయోధ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బౌద్ధ సన్యాసులు నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థలాన్ని చదును చేసేప్పుడు లభించిన వస్తువులు మానవ కల్పితాలుగా పేర్కొన్నారు. రామ మందిర నిర్మాణ స్థలాన్ని చదును చేసేప్పుడు ఆ స్థలంలో ఓ శివలింగం, ఏడు నల్లరాతి పిల్లర్లు, ఆరు రెడ్ స్టోన్ పిల్లర్లు, నాలుగు పగిలిన దేవుడు, దేవతా విగ్రహాలు లభ్యమయ్యాయి. కాగా స్వాధీనం చేసుకున్న వస్తువులు బౌద్ధ సాంప్రదాయానికి చెందినవని, ఈ స్థలం బౌద్ధ క్షేత్రమని పేర్కొంటూ బౌద్ధ సన్యాసులు నిరసనలు చేపట్టారు. యూనెస్కో చేత ఆ స్థలంలో తవ్వకాలు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. రామ మందిరం పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బౌద్ధమత అనుచరులు అయోధ్యను పురాతన కాలంలో బౌద్ధ మతానికి కేంద్రంగా ఉన్న సాకేత్ నగరంగా భావిస్తారు. అయోధ్య పరిపాలన విభాగం ద్వారా భారత రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు ఇతర ప్రభుత్వ ఏజెన్సీలకు మెమోరాండం పంపించినట్లు ఆజాద్ బౌద్ధ్ ధర్మ సేనా సభ్యుడు తెలిపారు. రామాలయ నిర్మాణాన్ని ఆపకపోయినా, స్థలాన్ని తవ్వకాల నిమిత్తం యూనెస్కోకు అప్పగించక పోయినా తమ ఉద్యమాన్ని తిరిగి కొనసాగిస్తామని తెలిపారు. కాగా బౌద్ధ నాయకుల నుంచి మెమోరాండం అందుకున్నట్లు ఫైజాబాద్ సిటీ మేజిస్ట్రేట్ ఎస్.పి.సింగ్ తెలిపారు. విజ్ఞాపనలను సంబంధిత వ్యక్తులకు పంపించనున్నట్లు చెప్పారు. తమ హామీలతో బౌద్ధులు నిరసనను విరమించుకున్నట్లు పేర్కొన్నారు.

## సరిహద్దుల్లో తేలికపాటి యుద్దట్యాంకులు

### -సేకరణకు ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,జూలై16(ఆర్ఎన్ఎ): చైనాతో సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో తేలికపాటి ట్యాంకుల అత్యవసర సేకరణకు కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ట్యాంకులను అధిక ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో మోహరించే అవకాశం ఉంది. ఏప్రిల్ నెలాఖరులో తూర్పు లడఖ్‌లోని ఎల్ఏసీ వెంట కొత్త టైప్-15 తేలికపాటి ట్యాంకులను చైనా మోహరించడం భారత్ కు తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. ఈ క్రమంలో సైన్యం అమ్ములపొదిలో అలాంటి రకం యుద్ధ ట్యాంకులను వీలైనంత త్వరగా చేర్చేందుకు భారత్ సిద్దమైంది. లడఖ్ ప్రాంతంలో తేలికపాటి యుద్ధ ట్యాంకులు వచ్చినపక్షంలో అవి భారత సైన్యానికి పెద్ద ఊపునిస్తాయి. అవి ప్రధాన యుద్ధ ట్యాంకులతో పోలిస్తే మరింత చురుకైనవి. భవిష్యత్తులో చైనా మనపై దాడి చేసేందుకు యత్నించిన పక్షంలో అడ్డుకోవడానికి ఎల్ఏసీ వెంట ముందుకు వెళ్లే ప్రదేశాల్లో మోహరించేందుకు వాయురవాణా చేయగలిగిన ట్యాంకులు అవసరమవుతాయని భారత సైన్యం కోరుకుంటున్నది. ఈ రకం యుద్ధ ట్యాంకులను చాలా దేశాలు తయారుచేస్తున్నాయి. సరిహద్దును కలుపుతూ చైనా విస్తృతమైన రహదారుల నెట్‌వర్క్ నిర్మించినప్పటికీ.. భారత్ మౌలిక సదుపాయాలు ఇంకా చైనా వేగంతో సరిపోలలేదు. భారత్ వ్యూహాత్మక ప్రదేశాలలో ఫార్వర్డ్ ఎయిర్ ఫీల్డ్ లను అభివృద్ధి చేసింది. ఇవే కాకుండా.. ఇతర అత్యవసర సేకరణలలో ఇజ్రాయెల్ నుంచి కొత్త ఆయుధాలు, ఎక్కువగా హెరాన్ మానవరహిత వైమానిక వాహనాలు, అదనపు సిగ్ సావర్ అటాల్ట్ రైఫిల్స్, ఉపరితలం నుంచి గాలికి పోర్టబుల్ రక్షణ క్షిపణులు, స్పైక్ ట్యాంక్ యాంటీ గైండెడ్ క్షిపణులు ఉన్నాయి. వాయు రవాణా ద్వారా ట్యాంకులను ఆపరేట్ చేసే ఏకైక దేశం రష్యా. బలహీనమైన కవచం ఉన్నప్పటికీ.. స్ప్రట్-ఎస్డిఎమ్ 1 వంటి ఆధునిక యుద్ధ ట్యాంకులతో పోల్చదగిన్న ÷ర్‌పవర్‌ను కలిగి ఉన్నది.

## ఎడ్లబండి బోల్తా: మూడేళ్ల బాటుడు మృతి

కుమ్రంభీం ఆసిఫాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): ఎడ్లబండి బోల్తా పడడంతో.. దానిపై ప్రయాణిస్తున్న ఓ మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ విషాద ఘటన చింతలమానేపల్లి మండలంలోని కర్జెల్లి గ్రామంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అంజన్న, సంధ్య దంపతులు వృత్తిరీత్యా వ్యవసాయదారులు. ఈ క్రమంలో పొలం వద్దకు ఎరువుల సంచులను ఎద్దుల బండిపై తీసుకెళ్తున్నారు. ఈ

బండిపై అంజన్నతో పాటు సంధ్య, కుమారుడు కుబిడే వరుణ్(3) కూడా ఉన్నాడు. దారి మధ్యలో ప్రమాదవశాత్తు ఎద్దుల బండి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వరుణ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, భార్యాభర్తలిద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. ఎరువుల సంచులన్నీ బాలుడిపై పడడంతో.. అతనికి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## ఎడిబి వైస్ ప్రెసిడెంట్‌గా అశోక్ లావాసా

### -ఇసి కమిషనర్‌గా తప్పుకోనున్నట్లు సమాచారం

న్యూఢిల్లీ,జూలై16(ఆర్ఎన్ఎ): భారత ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు మనీలాలోని ఎడిబి ప్రధాన కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది. ఎడిబి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్స్‌కు, ప్రైవేట్ సెక్టార్ ఆపరేషన్స్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా అశోక్ లావాసా వ్యవహరించనున్నారు. కాగా, తన పదవీ కాలం ముగియకముందే ఎలక్షన్ కమిషన్ నుంచి తప్పుకున్న రెండో ఎన్నికల కమిషనర్‌గా అశోక్ లావాసాను చెప్పవచ్చు.

1973లో చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఉన్న నాగేంద్రసింగ్.. హేగ్‌లోని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్‌లో జడ్జిగా నియమితులై ఎలక్షన్ కమిషనర్ బాధ్యతల నుంచి వైదొలిగారు. ఇప్పుడు దాదాపు 47 ఏండ్ల తర్వాత అశోక్ లావాసా సైతం పదవీకాలం ముగియకముందే ఎలక్షన్ కమిషన్ నుంచి తప్పుకుంటున్నారు.

అశోక్ లావాసా హర్యానా క్యాడర్ ఐఏఎస్ అధికారి. రిటైర్డ్ ఐఏఎస్ అయిన ఆయన 2018 జనవరిలో ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆయన పదవీకాలం ఇంకా రెండేండ్లు మిగిలి ఉండగానే ఎలక్షన్ ప్యానెల్ నుంచి తప్పుకోబోతున్నారు. అశోక్ లావాసాకు ప్రైవేట్ సెక్టార్ ఆపరేషన్స్‌పైనా, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్స్‌పైనా సుదీర్ఘ అవగాహన ఉండటంతో ఉపాధ్యక్షుడి నియమించినట్లు ఎఊ తన ప్రకటనలో పేర్కొన్నది. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని ఉల్లఘించిన కేసులో ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలపట్ల అశోక్ లావాసా నిక్కచ్చిగా వ్యవహరించారు. దీంతో ఆయన కుటుంబీకులపై ఐటీ, ఈడీ దాడులు జరిగాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తప్పుకోవాలని అశోక్ లావాసా నిర్ణయించుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

# గిరిజన విద్యలో రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాలి : మంత్రి సత్యవతి



మహబూబాబాద్ , జులై 16: సీఆర్టీలో చిత్తశుద్ధి పని చేసి గిరిజన విద్యలో రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలుపాలని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. గిరిజన విద్యాలయాల్లో 1950 మంది కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్‌ను రెన్యువల్ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం నాయకులు గురువారం మంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దారవత్ బాలాజీ, ఉపాధ్యక్షుడు వట్టం శంకర్ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సీఎం లక్ష్య సాధనలో అందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. కరోనా లాక్‌డౌన్‌తో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం కేసీఆర్ సీఆర్టీలందరినీ రెన్యువల్ చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

# కరోనా కట్టడికి చర్యలు తీసుకోండి

## ఎలాంటి సదుపాయాలైనా కల్పిస్తున్నాం
## జిల్లా వైద్యారోగ్య అధికారులతో మంత్రి సమీక్ష

మహబూబాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైరస్ వ్యాప్తిని కట్టడి చేసి, రోగులకు మెరుగైన వైద్యం అదించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ జిల్లా అధికారులను ఆదేశించారు. కరోనా బాధితులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఇంకా మెరుగైన వైద్యం అందించేందుకు ఎలాంటి వసతులు, వనరులు కావాలో సూచిస్తే వెంటనే అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వైద్యులకు కావాల్సిన పీపీఈ కిట్స్, కనీస సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో కరోనా పరిస్థితులపై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ భీమ్ సాగర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సతీష్ తో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ... పాజిటివ్ గా నిర్ధారణ జరిగి ఇళ్లలో ఐసోలేషన్ ఉంటున్న వారికి ప్రభుత్వం ఐసోలేషన్ కిట్స్ అందిస్తుం దన్నట్లు తెలిపారు. వాటిని బాధితులకు సరైన సమయంలో అందేలా చూడాలన్నారు. ప్రతి బాధిత వ్యక్తిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. కరోనా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూనే, పాజిటివ్ నిర్ధారణ అయిన వారికి త్వరగా కోలుకునేందుకు తీసుకోవాల్సిన మందులతో పాటు ధైర్యం కల్పించే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. కరోనా మందులేని వ్యాధి మాత్రమేనని కానీ నయం కానీ వ్యాధి మాత్రం కాదన్నారు. సరైన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి నుంచి బయటపడొచ్చన్నారు. కరోనా వచ్చి కోలుకుని క్షేమంగా బయ టపడిన వారే అత్యధికంగా ఉన్నారన్నారు. వైరస్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న వారు చాలా స్వల్పమన్నారు. కావునా కరోనా పాజిటివ్ అనగానే కంగారు పడకుండా ధైర్యంగా ఉంటూ వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు.

# గ్రామాలు,పట్టణాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

## దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి
## జిల్లా కలెక్టర్లతో సిఎస్ సోమేశ్ కుమార్ సమీక్ష

హైదరాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): వర్షాకాలం సీజన్ కావడంతో గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సిఎస్ సోమేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు.అదేవిధంగా పారిశుధ్యం, క్రిమిసంహారక మందులను చల్లడం, లార్వా నివారణ చర్యలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.పట్టణ ప్రగతి, రైతు వేదిక నిర్మాణాలపై జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా విలీనం అయిన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మునిసిపాలిటీల చట్టం ప్రాముఖ్యతనిస్తుందన్నారు. విలీన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనను కలెక్టర్లు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. రైతు వేదికలకు సంబంధించి మిగిలిన అన్ని అనుమతులు ఈ నెల 18 వరకు వస్తాయని అనంతరం పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలన్నారు. రైతు వేదిక నిర్మాణాలను పరిశీలించేందుకు సీనియర్ అధికారులను నియమించాలన్నారు. అన్ని రైతు వేదిక నిర్మాణాలను 2020 అక్టోబర్ 10వ లోగా పూర్తి చేయాలన్నారు. రైతు బంధు సమస్యలు, కల్లాల నిర్మాణం, గోడౌన్ల నిర్మాణం, ప్రత్యేక ఆహార ప్రాసెసింగ్ జోన్లకు సంబంధించిన అంశాలపై సైతం సీఎస్ భేటీలో సమీక్షించారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వ ప్రాధాన్యతలను అనుసరించి పనిచేయాలని ఆయన కలెక్టర్లను కోరారు. ఈ సమావేశంలో పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి జనార్దన్ రెడ్డి, పీఆర్ అండ్ ఆర్డీ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ రఘునందన్ రావు, పురపాలకశాఖ డైరక్టర్, కమిషనర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# హోండా కార్స్ ఇండియా వారు భారతదేశంలో ఆల్ న్యూ 5వ జనరేషన్ హోండా సిటీని విడుదల చేశారు 'రష్ ఆఫ్ సుప్రిమసీ'ని ఆస్వాదించండి




హైదరాబాద్, జులై 16భారతదేశంలో ప్రీమియం కార్ల తయారీలో అగ్రగామి అయిన హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ (ఊఅఎఒ), భారతదేశంలో ఈ రోజు, అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆల్ న్యూ 5వ జనరేషన్ హోండా సిటీని విడుదల చేసింది. భారతదేశంలో 1998 జనవరిలో తొలిసారి ప్రవేశపెట్టబడిన హోండా సిటీ, మధ్యతరహాపరిమాణపు సెడాన్లలో దేశంలో అత్యంత విజయవంతమైనది. భారతదేశంలో సెడాన్ అసలైన అధికారపు ఆకారానికి నిర్వచాన్ని చెబుతూ వచ్చిన హోండా, ఇప్పుడు తన 5వ జనరేషన్‌హోఁకు చేరుకున్న నేపథ్యంలో, తన కస్టమర్ల అవసరాలు మరియు ఆశలకు అనుగుణంగా తనను తాను పునరావిష్కరించుకున్నది. ఎంతోకాలంగా అభిమానులు ఎదురుచూస్తున్న ఆల్-న్యూ హోండా సిటీని, ఘనచరిత్రను కొనసాగించే విధంగా, ఆధిపత్యాన్ని అందించే విధంగా, తన కస్టమర్లకు అత్యుత్తమ విలువను అందించటం ద్వారా గతంలో నిర్ధారించిన ప్రమాణాలను అధిగమించే విధంగా రూపొందించటం జరిగింది.

భారతదేశంలోనూ, ఆసియాన్ దేశాల్లోనూ మరియు ఇతర మార్కెట్లలోనూ ప్రజలకు అవసరాలను, వారి జీవనశైలలను అనుసరించి జపాన్‌హోలోని తొచిగిలో నెలకొని ఉన్న హోండా ఆర్ అండ్ డి సెంటర్‌హోలో కొత్త హోండా సిటీని అభివృద్ధి చేయటం జరిగింది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ గాకు నకనిషి, ప్రెసిడెంట్ మరియు సిఇఒ, హోండా కార్స్ ఇండియా, ఇలా అన్నారు, "22 సంవత్సరాలకు పైగా హోండా సిటీ, దీర్ఘకాలం నడుస్తున్న నేమ్‌హోప్లేట్లలో ఒకటిగా, భారతదేశ ఆటోమోటివ్ చరిత్రలో మా వ్యాపారానికి మూలస్థంభంగా నిలిచి ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం మీద 4 మిలియన్లకు పైగా విక్రయాలను కలిగి ఉన్న హోండా, భారతదేశంలో ఇప్పటికే 8 లక్షలకు పైగా కస్టమర్లకు సంతోషాలను పంచి ఇచ్చింది, ఇంకా మరెందరో ఈ మోడల్‌హోను స్వంతం చేసుకునేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. సిటీ తన ప్రతి జనరేషన్‌హోతో, డిజైన్, టెక్నాలజీ, నాణ్యత, డ్రైవింగ్‌హోలో ఆనందం, కంఫర్ట్ మరియు భద్రతల విషయాల్లో ప్రమాణాలను ఉన్నతం చేసింది. అంతే కాక పరిశ్రమలో తొలిసారిగానో లేక తన సెగ్మెంటులో తొలిసారిగానో ఎన్నో ఫీచర్లను అందిస్తూ వచ్చింది." "సిటీ చరిత్రలో మునుపెరుగని విధంగా ఒక సరికొత్త విలువను మా కస్టమర్లకు అందించటం మా ఆశయం. మిడ్-సైజ్ సెడాన్ సెగ్మెంటులో ఆల్ న్యూ సిటీ తాజాగా ఉత్సాహాన్ని నింపగలదని మాకు నమ్మకం ఉన్నది," అని అన్నారు.

## మీరాలం మండి ఆలయంలో నాయిని పూజలు

హైదరాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం మీరాలం మండి మహంకాళేశ్వరి దేవాలయంలో శాకాంబరీ అలంకరణ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. నిజాం కాలం నుండి నగరంలోని ప్రజలకు అన్ని రకాల కూరగాయల సరఫరాకు ప్రధాన కేంద్రంగా ప్రసిద్ధి చెందిన మీరాలం మండిలో ప్రతి సంవత్సరం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఈ రోజు మాజీ మంత్రి నాయిని నర్సింహరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

# అయ్యప్ప సొసైటీలో కొనసాగిన కూల్చివేతలు

హైదరాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): అయ్యప్ప సొసైటీలో భారీ భవనాలు కూల్చేందుకు అధికారులు యంత్రాలను తరలించి కూల్చివేతలను చేపట్టారు. తాము ముందే నోటీసులు ఇచ్చామని తెలిపారు. అయితే కట్టడాల కూల్చివేత వద్దని స్థానికులు, స్థానిక నేతలు ధర్నాకు దిగారు. స్థానిక కార్పోరేటర్ ప్రజలకు మద్దతుగా నిలిచారు. అయ్యప్ప సొసైటీలో నిర్మితమైన భవనాలు అక్రమమైనవని, వాటికి సంబంధించి జీహెచ్ఎంసీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని పేర్కొంటూ కూల్చివేత ప్రక్రియ గత కొంతకాలంగా కొనసాగుతోంది. గతంలో చాలా భవనాలను అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ తీరుపై స్థానిక ప్రజలు, నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవనాలు నిర్మిస్తున్నప్పుడు అధికారులు ఎవరూ రాలేదని, అభ్యంతరం వ్యక్తం చేయలేదని, భవనాలు పూర్తి అయిన తర్వాత అక్రమ కట్టడాల పేరుతో కూల్చివేయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. భవనాల రెగ్యులరైజ్‌కు సంబంధించి ఫీజులు చెల్లించమంటే చెల్లిస్తామని స్థానికులు చెబుతున్నారు.

# నర్సుపై అత్యాచార యత్నం

## డాక్టర్‌ను చితకబాదిన తోటి నర్సులు

చండీఘర్,జూలై16(ఆర్ఎన్ఎ): పీకల దాకా మద్యం సేవించిన ఓ డాక్టర్ కామంతో.. విధుల్లో ఉన్న నర్సుపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో నర్సులందరూ ఏకమై అతన్ని చితకబాదారు. ఈ ఘటన పంచకుల సెక్టార్-6లోని సివిల్ ఆస్పత్రిలో ఈ నెల 11న రాత్రి చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. సివిల్ ఆస్పత్రిలో కొవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి డాక్టర్ జసిత్ కుమార్ విధుల్లో ఉన్నారు. ఐసోలేషన్ వార్డులో విధులు ముగించుకున్న నర్సు.. తన గదిలోకి వెళ్లి నిద్రకు ఉపక్రమించింది. అప్పటికే రౌండ్స్ పూర్తికావడంతో.. ఆస్పత్రిలోనే డాక్టర్ మద్యం సేవించాడు. మద్యం మత్తులో కామంతో రగిలిపోయాడు. నర్సు ఉన్న గదిలోకి వెళ్లి ఆమెపై అత్యాచారం చేసేందుకు యత్నించాడు. అప్రమత్తమైన నర్సు కేకలు వేస్తూ ఐసీయూలోకి పరుగెత్తింది. డాక్టర్ కుమార్ అక్కడ్నుంచి తప్పించుకుని కారులో తన ఇంటికి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలు చీఫ్ మెడికల్ ఆఫీసర్ కు ఫిర్యాదు చేసింది. కానీ ఉన్నతాధికారులు ఈ ఘటనను సీరియస్ గా తీసుకోలేదు. దీంతో సోమవారం రాత్రి బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు డాక్టర్ కుమార్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే మంగళవారం ఆస్పత్రికి వచ్చిన డాక్టర్ పై నర్సులందరూ కలిసి దాడి చేశారు. తక్షణమే డాక్టర్ ను విధుల నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

# పైలట్ రాజకీయ వ్యూహంపై సర్వత్రా చర్చ

## తదుపరి ఏ చర్య తీసుకుంటారో అని ఉత్కంఠ

జైపూర్,జూలై16(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీకి ఎదురుతిరిగిన సచిన పైలట్ తదుపరి ఎలా వ్యవహరిస్తారనేది ఇప్పుడు రాజకీయంగా చర్చ సాగుతోంది. తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, బిజెపిలో చేరేదీ లేదని స్పష్టం చేయడంతో ఆయన వ్యూహంపై తర్జనభర్జన సాగుతోంది. రాజస్థాన్ పీసీసీ చీఫ్ పదవితోపాటు డిప్యూటీ సీఎం పదవి నుంచి ఆయనను తొలగించిన కాంగ్రెస్ పార్టీ తాజాగా నోటీసులు కూడా జారీ చేసింది. సీఎల్పీ భేటీకి గైర్హాజరుపై రెండు రోజుల్లో సమాధానం చెప్పకపోతే పార్టీ సభ్యత్వం నుంచి తొలగించాల్సి వస్తుందని హెచ్చరించింది. సచిన్ కోసం కాంగ్రెస్ పార్టీ ద్వారాలు తెరిచే ఉన్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అలాగే ఆయనతో మంతనాలు జరిపి బుజ్జగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సచిన్ పైలట్ రాజీ ఒప్పందానికి రావచ్చని తెలుస్తున్నది. సీఎం పదవి ఇచ్చేది లేదని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే స్పష్టం చేయడంతో ఆ పదవిపై ఆశలు వదులు కోవాల్సిందే. అయితే ప్రత్యామ్నాయంగా పార్టీలో సచిన్‌కు గౌరవం దక్కేలా పీసీసీ చీఫ్ పదవిని తిరిగి కట్టబెట్టడం, ఆయన అనుచరులకు క్యాబినెట్‌లో చోటు కల్పించడం, తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన వారికి ఎక్కువ టికెట్లు కేటాయించడం వంటి వాటిపై ఒప్పందం జరిగే అవకాశమున్నది.

రాష్ట్రంలో కొన్నేండ్లుగా బీజేపీపై పోరాడుతున్న తాను ఆ పార్టీ చెంతన చేరలేనని చెబుతున్నారు. బీజేపీలో చేరే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే ఒకవేళ బీజేపీ ప్రముఖులు సచిన్‌ను సంప్రదించి సీఎం పదవి ఇస్తామని చెబితే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకుంటారా అన్నది సందేహమే. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత మెజార్టీ ఉండటంతో ఈ దిశగా ఆయన ప్రయత్నించకపోవచ్చని కూడా అన్నారు. సొంత పార్టీని ఏర్పాటు చేయడం. బీజేపీకి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కొత్తగా ప్రాంతీయ పార్టీని నెలకొల్పడం.

# ఇక వరంగల్‌లోనే కరోనా చికిత్సలు

## చుట్టుపక్కల ప్రజలకు మేలు చేసేదిగా చర్యలు
## కరోనా కోసం సెంట్రల్ జైలులో 200 పడకల ఆస్పత్రి
## మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వెల్లడి

వరంగల్,జూలై16(ఆర్ఎన్ఎ): ఇక నుంచి వరంగల్‌చుట్టుపక్కల జిల్లాల కరోనా రోగులందరికీ వరంగల్‌లోనే చికిత్సలు అందిస్తామని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లిదయాకర్‌రావు స్పష్టంచేశారు. కరోనా నియంత్రణకు కావాల్సిన సకల ఏర్పాట్లు వరంగల్‌లోనే చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రజలు ఆందోళన పడొద్దని, కరోనా వచ్చిందనో, వస్తుందనో అక్కడా ఇక్కడా తిరగవద్దని హెచ్చరించారు. ప్రజా సేవకు ఇది మంచి తరుణమని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి. వైద్యులు కూడా మీ సేవలు అందించాలని వారికి పిలుపునిచ్చారు. హన్మకొండలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఎంజిఎంవైద్యులు, ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలతో చర్చించారు. ఈసందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాటాడుతూ రానున్నరోజుల్లో కరోనాని ఎదుర్కొనడానికి అవసరమైనచర్యలపై సుదీర్ఘంగా చర్చించామని చెప్పారు. ప్రజల్లో ఆందోళనలను పోగొట్టడమే కాదు, వారికి అన్నిరకాల వైద్యసేవలను స్థానిక వరంగల్‌లోనే ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. కరోనా నియంత్రణకు కావాల్సిన ఏర్పాట్లు, వరంగల్‌లోనే సకల సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఇక వరంగల్ చుట్టుపక్కల జిల్లాల పేషెంట్‌లకు వరంగల్‌లోనే చికిత్స అందిస్తామని వెల్లడించారు. ప్రధాన మంత్రి స్వాస్థ్య సంయోజన పథకం కింద వరంగల్ సెంట్రల్‌జైలు ఆవరణలో నిర్మించిన 200పడకల వైద్యశాలను కోవిడ్‌హాస్పిటల్‌గా వినియోగించుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు. మరో వైపు అనేక రకాల పేషెంట్లు వచ్చే ఎంజిఎంని మాత్రం సాధారణ వైద్యశాలగానే వినియోగించనున్నట్టు చెప్పారు. కాగా సాధారణ కరోనా రోగులకు ఐసొలేషన్‌వార్డుగా కాకతీయ యూనివర్శిటీని వినియోగించాలని కూడా నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు. ఇక చికిత్సలు చేసే డాక్టర్ల కోసం హోటల్‌హరితను వినియోగించనున్నట్టు తెలిపారు. ఈసమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, ఎంపీ బండా ప్రకాశ్, మేయర్ గుండా ప్రకాశరావు, ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, చల్లాధర్మారెడ్డి, పెద్దిసుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సచిన్‌ను వెనక్కి రప్పించే యత్నాలు ముమ్మరం

## పైలట్‌పై చర్యలు తీసుకోవద్దని రాహుల్ సూచన
## వెంటనే కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలని పిలుపు
## రంగంలోకి అహ్మద్ పటేల్, రణ్‌దీప్ సూర్జేవాలా

జైపూర్,జూలై16(ఆర్ఎన్ఎ): రాజస్థాన్ రాజకీయాలు మలుపులు తిరుగుతున్నాయి. తిరుగుబాటు నేత సచిన్ పైలట్‌ను దారిలోకి తెచ్చుకోవాలని ఓ వైపు ప్రయత్నాలు చేస్తుండగా అతడిని అనర్హుడిని చేయాలని సిఎం గెహ్లాట్ పావులు కదుపుతున్నారు. ఈ మేరకు స్పీకర్ ద్వారా అనర్హత నోటీసులు ఇవ్వాలని చూస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ తిరుగుబాటుదారు సచిన్ పైలెట్‌కు అధిష్ఠానం చివరి ఛాన్స్ ఇచ్చింది. రెబెల్స్ ఎమ్మెల్యేలను వెంట బెట్టుకుని వెంటనే జైపూర్‌కు వచ్చి కాంగ్రెస్‌లో చేరి పోవాలని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. ఇదే విజ్ఞాపనను అధిష్ఠానం దూత, కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా కూడా చేశారు. కొన్ని రోజుల క్రితం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కూడా పైలట్‌కు ఫోన్ చేసినట్లు సమాచారం. కానీ పైలట్ స్పందించలేదని ఢిల్లీ వర్గాల సమాచారం.

ఈ సంఘటనతో చిర్రెత్తుకొచ్చిన ఓ సీనియర్ నేత... పైలట్ బిజినెస్ క్లాస్ మనిషి అంటూ తీవ్రంగా మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ మాత్రం ఈ తిరుగుబాటుపై మొదట్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినా.... తర్వాత మాత్రం వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నారని అధిష్ఠానం ప్రముఖులు పేర్కొన్నారు.'కాంగ్రెస్ కుటుంబంలో చేరడానికి సచిన్ పైలట్‌కు లాస్ట్ ఛాన్స్ ఇవ్వండి... తొందరపడొద్దని సీనియర్లకు సూచించినట్లు సమాచారం. ఇక, సోనియా గాంధీకి అత్యంత సన్నిహితుడైన అహ్మద్ పటేల్ కూడా పైలట్‌తో ఫోన్లో మాట్లాడారు. అంతేకాకుండా మిగితా సీనియర్లు కూడా ఫోన్లో మాట్లాడారు. అయితే పైలట్ మాత్రం కాంగ్రెస్ పునరాగమనంపై ఎలాంటి హామీ వారికివ్వనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌కు ఎదురు తిరిగిన సచిన్ పైలట్‌ను పార్టీలోకి తెచ్చేందుకు చివరి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సీనియర్ నేత రణదీప్ సింగ్ సుర్జేవాలా ఈ దిశగా చొరవచూపారు. సచిన్‌ను కుటుంబ సభ్యుడిగా పేర్కొన్న ఆయన పార్టీలోకి తిరిగి రావాలని ఆహ్వానించారు. బీజేపీలో చేరడం లేదని సచిన్ పైలట్ స్పష్టం చేసిన నేపథ్యంలో ఆయనతో సంప్రదింపులను కాంగ్రెస్ పార్టీ ముమ్మరం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో బుధవారం నిర్వహించాల్సిన మీడియా సమావేశాన్ని సచిన్ పైలట్ చివరి నిమిషంలో రద్దు చేశారు. కాగా, తన వెంట 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని సచిన్ పైలట్ ఆదివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే వాస్తవానికి 16 నుంచి 18 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఆయనకు మద్దతుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సీఎం గెహ్లాట్‌కు ఎదురుతిరిగిన సచిన్ పైలట్ పునరాలోచనలో పడినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తున్నది.

# భిక్షగాళ్లు, కాగితాలు ఏరుకునే వారికి రక్షణ

## మాస్కులు,సబ్బుల పంపిణీకి నిర్ణయం

మచిలీపట్నం,జూలై16(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి.. చాపకింద నీరులా రోజుకు రోజుకు విస్తరిస్తోంది. పేద, ధనిక తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కర్ని గడగడలాడిస్తోంది. భిక్షగాళ్లు, చిత్తుకాగితాలు ఏరుకునే వారు, ఎలాంటి ఆధారం లేకుండా చెట్ల కింద, బస్టాండ్లలో కాలక్షేపం చేసే వారి పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. వీరు కోవిడ్ బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కోవిడ్‌పై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. అంతే కాకుండా ఆరు మాస్కులు, రెండు సబ్బులతో కూడిన కిట్లులు అందించనుంది. నగరాలు, పట్టణాల్లో సంచ రించే వీరికి మెప్మా ద్వారా రూ.70 విలువైన కిట్ పంపిణీ చేయాలని నిర్ణయించింది. అందుకోసం విజయవాడ కార్పొరేషన్‌తో సహా జిల్లా వ్యాప్తంగా నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న భిక్షగాళ్లు, చిత్తుకాగితాలు ఏరుకునే వారు, రోడ్డుపక్క ఎలాంటి ఆధారం లేకుండా జీవిస్తున్న వార్ని ఇప్పటికే మెప్మా సహకారంతో గుర్తించారు. ఈ విధంగా విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 997 మంది ఉన్నారు. అదే విధంగా మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో 230 మంది, గుడివాడ పట్టణ పరిధిలో 300 మంది, తిరువురూలో 94 మంది, జగ్గయ్యపేటలో 80 మంది, నందిగామలో 68, నూజివీడులో 60 మంది పెడనలో 58 మంది, ఉయ్యూరులో 34 మంది కలిపి మొత్తం 1991 కుటుంబాలును గుర్తించారు. రాష్ట్రంలోనే తొలిసారి బుధవారం కృష్ణా జిల్లాలో ఈ కిట్‌లను పంపిణీ చేయనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఈ కిట్‌లు పంపిణీ చేయనున్నట్లు మెప్మా పీడీ డాక్టర్ ఎన్ ప్రకాశరావు తెలిపారు.

# కరోనాతో 99మంది వైద్యులు మృతి

## ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వెల్లడి

న్యూఢిల్లీ,జూలై16(ఆర్ఎన్ఎ): తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి కంటికి కన్పించని కరోనా వైరస్‌తో వైద్యులు పోరాడుతున్నారు. దేశవ్యాప్తంగా కరోనా విధుల్లో వైరస్ సోకి ప్రాణాలు కోల్పోతున్న డాక్టర్ల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతున్నది. ఇప్పటి వరకు దేశంలో 1,302 మంది వైద్యులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, 99 మంది ప్రాణాలు కోల్పోయారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెలిపింది. ఈ నేపథ్యంలో వైద్య నిపుణులను ఐఎంఏ అలర్ట్ చేసింది. కరోనా సోకినవారిలో 586 మంది ప్రాక్టీస్ చేస్తున్న వైద్యులు కాగా, 566 మంది రెసిడెంట్ డాక్టర్లు, 150 మంది హౌస్ సర్జన్లు ఉన్నారని ఐఎంఏ ఏర్పాటు చేసిన నేషనల్ కోవిడ్ రిజిస్ట్రీ తెలిపింది. చనిపోయిన వైద్యులలో 73 మంది 50ఏండ్లు పైబడిన వారు కాగా, 19 మంది 35-50 ఏళ్ల మధ్య వయస్సుగలవారని పేర్కొంది. ఏడుగురు మాత్రం 35ఏళ్లలోపువారని వెల్లడించింది.

# కరోనాపై రాజకీయాలు మానండి

## కాంగ్రెస్‌కు కర్నాటక మంత్రి హితవు

బెంగళూరు,జూలై16(ఆర్ఎన్ఎ): కరోనా నియంత్రణ విషయంలో క్యాబినెట్‌లో చీలిక వచ్చిందన్న ఆరోపణలు నిరాధారమని కర్ణాటక ఆరోగ్యశాఖ మంత్రి బీ శ్రీరాములు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయాలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు. కరోనా సంక్షోభ సమయంలో ఇలాంటి ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఇలాంటివి ప్రజల్లో భయాందోళన కలిగిస్తాయన్నారు. కరోనా నియంత్రణకు తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ విషయంలో మంత్రుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని శ్రీరాములు చెప్పారు. ఇలాంటి కష్టకాలంలో దేవుడు తప్ప ఎవరూ ఏమీ చేయలేరని, వైరస్ వ్యాప్తి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయవద్దని కాంగ్రెస్ నేతలకు ఆయన హితవుపలికారు. తాము ఏదైనా తప్పు చేస్తే శిక్షకు సిద్ధేనని శ్రీరాములు చెప్పారు.

# రాజస్థాన్ రాజకీయాల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

## కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేల ఇంటికి నోటీసులు

జైపూర్,జూలై16(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌లో రాజకీయాల్లో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ ఇంకా తన రాజకీయ భవిష్యత్తుపై ఎలాంటి స్పష్టతనివ్వలేదు. మరోవైపు సీఎల్పీ సమావేశానికి గైర్హాజరైన కారణంగా సచిన్ పైలట్‌తోపాటు మరో 18మంది రెబల్ ఎమ్మెల్యేలకు సభాపతి ద్వారా కాంగ్రెస్ నోటీసులు జారీ చేసింది. అనర్హతపై స్పీకర్ ఇచ్చిన నోటీసులపై సచిన్ పైలట్ హైకోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ విషయంపై ఆయన లీగల్ టీం ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇదే దారిలో రెబల్ ఎమ్మెల్యేలు కూడా వెళ్లనున్నారు. మరోవైపు మెసేజ్, వాట్సాప్, ఈ మెయిల్, పోస్టు ద్వారా పార్టీ నోటీసులు చేరవేసిన కాంగ్రెస్, తాజాగా రెబల్ ఎమ్మెల్యేల ఇంటికి నోటీసులు అంటించింది. శుక్రవారంలోపు ఈ నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇదిలా ఉంటే, నాలుగు రోజుల క్రితం తన మద్దతు ఎమ్మెల్యేలతో కలిసి దిల్లీ వెళ్లిన సచిన్‌పైలట్ రాజకీయ భవిష్యత్తుపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. కేవలం బీజేపీలో మాత్రం చేరట్లేదని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీలోకి సచిన్ పైలట్ తిరిగి రావడానికి ద్వారాలు తెరిచే ఉన్నాయని పలువులు కాంగ్రెస్ సీనియర్ నేతలు వెల్లడించారు. ఉపముఖ్యమంత్రితోపాటు మరో ఇద్దరు మంత్రులను బాధ్యతలనుంచి తప్పించిన నేపథ్యంలో రాజస్థాన్‌లో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం జరిగింది. ఇది గురువారమే ఉంటుందని అందరూ భావించారు. కానీ, తాజా పరిస్థితుల్లో తాత్కాలికంగా దానిని వాయిదా వేసినట్లు సమాచారం.

# గిరిజన విద్యలో రాష్ట్రాన్ని ముందు నిలపాలి: మంత్రి

మహబూబాబాద్,జూలై16(ఆర్ఎన్ఎ): సీఆర్టీలో చిత్తశుద్ధితో పని చేసి గిరిజన విద్యలో రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలుపాలని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. గిరిజన విద్యాలయాల్లో 1950 మంది కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్‌ను రెన్యువల్ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం నాయకులు గురువారం మంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దారవత్ బాలాజీ, ఉపాధ్యక్షుడు వట్టం శంకర్ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సీఎం లక్ష్య సాధనలో అందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. కరోనా లాక్‌డౌన్‌తో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం కేసీఆర్ సీఆర్టీలందరినీ రెన్యువల్ చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

# గంగూలీ సోదరుడికి కరోనా

## -సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లిన సౌరవ్

కోల్‌కతా,జూలై16(ఆర్ఎన్ఎ): బీసీసీఐ అధ్యక్షుడు, టీమిండియా మాజీ సారథి సౌరభ్ గంగూలీ కుటుంబంలో కరోనా వైరస్ కలకలం సృష్టించింది. గంగూలీ సోదరుడు, బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) కార్యదర్శి స్నేహాశీష్ గంగూలీకి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. స్నేహాశీష్‌కు కరోనా సోకడంతో దాదా కూడా హోం క్వారంటైన్‌లోకి వెళ్లారు. బెంగాల్ మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ అయిన స్నేహాశీష్ కోవిడ్-19 పాజిటివ్‌గా తేలడంతో బెల్లెవ్యూ హాస్పిటల్‌లో చేరారు. 'గత కొద్దిరోజుల నుంచి స్నేహాశీష్ జ్వరంతో బాధపడుతున్నాడు. కరోనా సోకినట్లు వైద్యపరీక్షల్లో తేలింది. వెంటనే ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని' క్యాబ్ అధికారి ఒకరు తెలిపారు. హెల్త్ ప్రొటోకాల్స్ ప్రకారం సౌరభ్ కూడా కొద్దిరోజులు హోం క్వారంటైన్‌లో ఉండాల్సి ఉంటుందని దాదా సన్నిహితుడొకరు చెప్పారు.

# ఏపిలో మరో 40మంది మృతి

## తాజాగా 2,593 పాజిటివ్ కేసులు

అమరావతి,జూలై16(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ ఉధృతి కొనసాగుతోంది. తాజాగా 2,593 పాజిటివ్ కేసులు నమోదైనట్లు ఏపీ ప్రభుత్వం బులిటెన్ విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంకయ 38,044కి చేరింది.కరోనా కారణంగా గురువారం ఒక్కరోజే 40 మంది ప్రాణాలు కోల్పోగా.. మొత్తం మృతుల సంఖ్య 492కి చేరింది. తూర్పు గోదావరిలో 8 మంది, ప్రకాశంలో 8, చిత్తూరులో 5, కడపలో 4, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, విశాఖ జిల్లాల్లో ముగ్గురు చొప్పున ప్రాణాలు కోల్పోగా.. కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. రాష్ట్ర వ్యాప్తంగా 18,159 మంది

వివిధ ఆస్పత్రులు, క్వారంటైన్ కేంద్రాల్లో చికిత్స పొందుతున్నారు.మరో 19,393 మంది కరోనా నుంచి కోలుకొని డిశ్చార్జి అయ్యారు. గత 24 గంటల వ్యవధిలో 22,304 నమూనాలను పరీక్షించిట్లు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 12.40 లక్షల మందికి కరోనా పరీక్షలు నిర్వహించినట్లు చెప్పింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.